ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
ఏలూరు
జిల్లా వార్తలు
5
శుక్రవారం 19 ఏప్రిల్ 2024

ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 42.0
కనిష్ఠం : 26.0

నామినేషన్ కౌంటర్ 1వ రోజు

అసెంబ్లీ నియోజకవర్గం	తొలి రోజు నామినేషన్లు	మొత్తం
1.ఆచంట	00	00
2.పాలకొల్లు	00	00
3.నరసాపురం	00	00
4.భీమవరం	00	00
5.ఉండి	00	00
6.తణుకు	00	00
7.తాడేపల్లిగూడెం	00	00
8.ఉంగుటూరు	00	00
9.దెందులూరు	01	01
10.ఏలూరు	01	01
11.పోలవరం	02	02
12.చింతలపూడి	00	00
13.నూజివీడు	02	02
14.కైకలూరు	00	00
మొత్తం	06	06

పార్లమెంట్ నియోజకవర్గం	తొలి రోజు నామినేషన్లు	మొత్తం
1.నరసాపురం	01	01
2.ఏలూరు	01	01
మొత్తం	02	02

తొలిరోజు ఏడు

జిల్లాలో నామినేషన్ల స్వీకరణ ప్రారంభం

- ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ నోటిఫికేషన్ విడుదల చేసిన కలెక్టర్, ఆర్వో ప్రసన్నవెంకటేశ్
- ఏలూరు ఎంపీ స్థానానికి ఒకటి.. అసెంబ్లీ స్థానాలకు ఆరు నామినేషన్లు
- నామినేషన్ స్వీకరణ కేంద్రాల వద్ద పటిష్ఠ బందోబస్తు


పోలవరం ఆర్వో సూర్యతేజ్‌కు నామినేషన్ పత్రాలు అందిస్తున్న కూటమి అభ్యర్థి బాలరాజు


ఏలూరు ఎంపీ స్థానానికి నామినేషన్ స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్



ఏలూరు సిటీ/ఏలూరు రూరల్/ దెందులూరు/ నూజివీడు/బుట్టాయగూడెం, ఏప్రిల్ 18 : సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల ఘట్టం గురువారం ప్రారంభం అయింది. ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గ నోటిఫికేషన్‌ను ఆర్వో, జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ గురువారం విడుదల చేశారు. నామినేషన్ల స్వీకరణ మొదటి రోజున జిల్లాలో ఏలూరు పార్లమెంట్‌కు ఒకటి, అసెంబ్లీ నియోజక వర్గాలకు 6 నామినేషన్లు దాఖలయ్యాయి. కలెక్టర్ ఛాంబర్‌లో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌కు ఏలూరు ఎంపీ స్థానానికి లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ తరపున మెండెం సంతోష్‌కుమార్ నామినేషన్‌ను అందజేశారు. ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గానికి వైసీపీ తరపున ఆళ్ల కాళీకృష్ణశ్రీనివాస్ (నాని) ఏలూరు తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ముక్కంటికి నామినేషన్ దాఖలు చేశారు. దెందులూరు నుంచి అలపాటి నరసింహమూర్తి (కాంగ్రెస్) నియోజకవర్గ ఆర్వో లావణ్యవేణికి నామినేషన్ అందించారు. నూజివీడు అసెంబ్లీ నియోజకరవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా ముద్దరబోయిన వెంకటేశ్వరరావు, ముద్దరబోయిన రాధికలు నామినేషన్లు దాఖలు చేశారు. జిల్లాలోని ఉంగుటూరు, చింతలపూడి, కైకలూరు అసెంబ్లీ నియోజక వర్గాలకు సంబంధించి నామినేషన్లు దాఖలు కాలేదు.

జిల్లాకు కేంద్ర ఎన్నికల వ్యయ పరిశీలకులు..

ఏలూరు సిటి : ఎన్నికల కమిషన్ ఏలూరు జిల్లాకు నియమించిన ఎన్నికల వ్యయ పరిశీలకులు పి.కీర్తి నారాయణ్, షెరింగ్ జోర్డన్ భాటియా, మేశ్రామ్ గౌరవ్ మధుకర్ జిల్లాకు వచ్చారు. గురువారం ఉదయం కలెక్టరేట్‌కు చేరుకున్న ఎన్నికల వ్యయ పరిశీలకులకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ పూల మొక్కను అందజేసి స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఛాంబర్‌లో సమావేశమయ్యారు. జిల్లాలోని పార్లమెంట్, అసెంబ్లీ నియోజక వర్గాల పరిధిలో ఖర్చుల అంచనా వివరాలు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలపై చర్చించారు. అనంతరం వ్యయ పరిశీలకులు కలెక్టరేట్‌లోని జిల్లా ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను పరిశీలిం చారు. డీఆర్వో పుష్పమణి, కలెక్టరేట్ ఏవో కాశీవిశ్వేశ్వరరావు, ఎన్నికల నోడల్ అధికారులు , కంట్రోల్ రూమ్ సిబ్బంది పాల్గొన్నారు.

● ఎన్నికల నేపథ్యంలో ఈఎస్‌ఎంఎస్ కింద చేపట్టిన సీజర్ మేనేజ్‌మెంట్ ప్రక్రియ ద్వారా ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా మొత్తం గా రూ.13.20 కోట్ల విలువైన నగదు, బంగారం, మద్యం , ఇతర వస్తువులు సీజ్ చేసినట్టు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. ఎన్నికల ప్రచార అనుమతుల కోసం సువిధ ద్వారా 1,662 అభ్యర్థనలు రాగా ఇంతవరకు 1625 అనుమతులు జారీ చేయగా మరో 37 పరిశీలనలో ఉన్నాయ న్నారు. సీ-విజిల్‌లో వచ్చిన 359 ఫిర్యాదులను, మీడియాలో ఎన్నికల ఉల్లంఘనలకు సంబంధించి వచ్చిన 97 ఫిర్యాదులు పరిష్కరించామన్నారు. ఎన్‌జి ఎస్పీ పోర్టల్ ద్వారా 597 ఫిర్యాదులు స్వీకరించగా వాటిలో 593 పరిష్కరించ బడ్డాయని , మరో 4 పరిశీలనలో ఉన్నాయన్నారు.

పోలవరం కూటమి అభ్యర్థిగా చిర్రి బాలరాజు (జనసేన) కేఆర్ పురం ఐటీ డీఏ ఛాంబర్‌లో రిటర్నింగ్ అధికారి ఎం.సూర్యతేజకు నామినేషన్ దాఖలు చేశారు. ఆయన వెంట నాయకులు కరాటం సాయి, గడ్డమణుగు రవికుమార్ ఉన్నారు. నామినేషన్ వేయడానికి ముందు కుటుంబ సమేతంగా ద్వారకా తిరుమల మండలం ఐఎస్ జగన్నాథ పురం లక్ష్మీనరసింహస్వామిని దర్శించు కుని బీఫారంను స్వామి పాదాల వద్ద ఉంచి ఆశీర్వాదం తీసుకున్నారు. బుట్టాయగూడెంలో శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోండ్వానా దండకారుణ్య పార్టీ తరపున మడకం వెంకటేశ్వరావు రిటర్నింగ్ అధికారికి నామినేషన్ అందజేశారు.

రంగంలోకి స్టాటిస్టికల్ బృందాలు

ఏలూరు క్రైం : సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కావడంతో ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఖర్చులను పరిగణించడానికి ఇప్పటికే ఎన్నికల కమిషన్ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసింది. జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ఏర్పాటు కాబడిన ఈ ప్రత్యేక స్టాటిస్టికల్ స్పెషల్ టీమ్స్ గురువారం రంగంలోకి దిగాయి. నామినేషన్లు వేస్తున్న అభ్యర్థులు ర్యాలీలో వినియోగిస్తున్న కార్లు, ఇతర ఖర్చులను పరిశీలిస్తున్నారు. వీరితో పాటు కేంద్ర, రాష్ట్ర నిఘా విభాగాలు రంగంలోకి దిగాయి. ఎన్నికల కమీషన్ ఆదేశాలతో త్వరలోనే షాడో పార్టీలను జిల్లా పోలీస్ యంత్రాంగం ఏర్పాటు చేయనుంది. ఇప్పటికే జిల్లాలో ఏర్పాటు చేసిన 31 ప్రత్యేక ఎన్నికల నియమావళి తనిఖీ బృందాలు తనిఖీలు చేస్తున్నాయి.

పటిష్ఠ బందోబస్తు


ఉంగుటూరులో బందోబస్తును పర్యవేక్షిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా నామినేషన్ల స్వీకరణ కేంద్రాల వద్ద, వివిధ ప్రధాన కూడళ్లల్లో పటిష్ఠ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఏలూరు పార్లమెంటు నియోజకవర్గానికి సంబంధించి కలెక్టర్ కార్యాలయంలో నామినేషన్ల స్వీకరణ నేపథ్యంలో కలెక్టరేట్‌కు వెళ్లే అన్ని మార్గాల్లో బారికేడ్లు ఏర్పాటు చేశారు. నగరంలో ముందస్తుగా పోలీస్ పికెట్లను ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా ప్రణాళికా బద్ధంగా చర్యలు తీసుకోవాలంటూ ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు.


నూజివీడు ఆర్వో వై.భవానీశంకరికి నామినేషన్ పత్రాలు అందిస్తున్న ముద్దరబోయిన వెంకటేశ్వరరావు


దెందులూరు ఆర్వో లావణ్యవేణికి నామినేషన్ పత్రాలు అందిస్తున్న కాంగ్రెసు అభ్యర్థి నరసింహమూర్తి

ఎక్కడెక్కడ... బలమెంత?

- నామినేషన్ల ముందే అంచనాలు. తగ్గట్లుగానే స్థానిక వ్యూహం
- సామాజిక వర్గాల మద్దతే అత్యంత కీలకం.. కూటమి అంచనాలు ఏమిటి?
- ఇక మిగిలింది మూడు వారాలే



(ఏలూరు, ఆంధ్రజ్యోతి ప్రతినిధి):
ఎన్నికల రణరంగంలో తాడోపేడో తేల్చుకోవడానికి రాబోయే మూడువారాలే కీలకం. నోటిఫికేషన్ వెలువడడంతో ఇప్పటివరకు జరిగే తంతు ఒక ఎత్తు, ఇక ముందు జరగబోయేది ఇంకో ఎత్తు. అభ్యర్థుల రోజువారీ కదలికలపై ఎన్నికల నిబంధనల నీడ వెన్నాడుతూనే ఉంటుంది. ఇప్పటికే కొందరు అభ్యర్థులు దీన్ని దృష్టిలో పెట్టుకుని అన్ని సర్దేసినట్టు చెబుతున్నారు. సామాజిక వర్గాలు, మహిళా గ్రూపులు, యువత టార్గెట్‌గా అంతా వ్యవహారం సాగుతోంది. ఎంపీ అభ్యర్థులే ఈసారి అత్యంత కీలకం. బలం, బలహీనతలను అంచనా వేసు కునే పనిలో పడ్డారు.

బలమెంత? బలహీనత ఏంటి ?

ఓవైపు అధికార యంత్రాంగం, ఎన్నికల సంఘం ప్రతి విషయాన్ని ఆరా తీస్తుంది. వ్యయ పరిశీలకులను గురువారం ఎన్నికల సంఘం జిల్లాకు పంపింది. ప్రతీది ఆచీతూచీ అభ్యర్థులు నిర్ణయాలు తీసుకోవాల్సిందే. ప్రతి వ్యయాన్ని పరిశీలకులు గమనిస్తారు. ఇప్పటికే అభ్యర్థులంతా గడిచిన నెలన్నర రోజులుగా విస్తృత ప్రచారం చేశారు. అన్ని వర్గాలను తమవైపు తిప్పుకోవడానికి ఎత్తులు, పై ఎత్తులు వేశారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులు ఇప్పటికే ఏడు నియోజక వర్గాల పరిధిలో ఎవరంతటి వారుగానే ప్రచారంలో ముందుకు సాగుతుండగా ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ కుమార్ యాదవ్ తోడు అయ్యారు. ఎన్నికల వ్యూహంలో పదునుగా వ్యవహరించడం, ఏ నియోజక వర్గంలో ఎలాంటి ప్రధాన సమస్యను ప్రజలు ఎదుర్కొంటున్నారు, వాటి పరిష్కార మార్గాలు, తాను చేయబోయే పనుల గురించి ఎంపీ అభ్యర్థిగా మహేష్ ఒకవైపు, ఇంకోవైపు ఎమ్మెల్యే అభ్యర్థులంతా గడిచిన ఐదేళ్లలో ఆగిన అభివృద్ధిని తిరిగి పునరుద్ధరిస్తామంటూ భరోసా ఇచ్చారు. దీనికి తోడు ఏఏ వర్గాల్లో తమకు బలం ఉందో తాము ఎక్కడ బలహీనంగా ఉన్నామో అంచనాలకు వచ్చేశారు. ఒకవైపు మండుటెండలు కాస్తున్నా ఖాతరు చేయకుండా ప్రచార హోరు దాదాపుగా అన్నిపార్టీలు సాగిస్తూనే ఉన్నాయి.

ఎంపీ అభ్యర్థే అత్యంత కీలకం

ఏలూరు లోక్‌సభ స్థానం పరిధిలో టీడీపీ అభ్యర్థిగా కూటమి పక్షాన మహేష్ కుమార్ యాదవ్ అన్నితానే వ్యవహరిస్తున్నారు. అసెంబ్లీ నియోజక వర్గాల అభ్యర్థులతో ఏరోజుకారోజు ఎన్నికల వ్యూహంపై చర్చించడం, పరిష్కార మార్గాలు తమకు మద్దతిచ్చే వారితో ప్రత్యేక చర్యలు, అధికార వైసీపీకి దీటుగా తాము ఎలా వ్యవహరించాలో, నియోజక వర్గాల్లో ఏ స్థాయిలో ఆధిపత్యం దిశగా అడుగులు వేయాలో కూటమి మహేష్ ఇప్పటికే చురుకైన పాత్ర పోషిస్తున్నారు. నియోజక వర్గాల్లో నేతలు, కూటమి అభ్యర్థుల మధ్య సమన్వయానికి ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. వైసీపీ నుంచి ఎంపీ అభ్యర్థిగా కారుమూరి సునీల్ పోటీ పడుతుండగా, ఆయనకు దీటుగా ముందంజ వేసేలా ప్రణాళికా బద్ధంగా ప్రచారం చేస్తున్నారు.

సామాజిక వర్గాల చుట్టూనే..

ఏలూరు లోక్‌సభ స్థానం పరిధిలో ఈసారి భిన్నమైన వాతావరణం ఉంది. 2019 ఎన్నికలతో పోలిస్తే ఈసారి జనసేన, టీడీపీ, బీజేపీ కూటమిగా ఏర్పడటం, అధికార వైసీపీని ఢీకొనే ఎత్తులు, పై ఎత్తులకు దిగుతున్నారు. ఒక సామాజిక వర్గంతో అధికారపార్టీ ప్రసన్నానికి ప్రయత్నిస్తే అదే తరుణంలో కూటమి తనశైలిని మార్చి ఆ సామాజికవర్గం నుంచే తమకు మద్దతు దక్కేలా జాగ్రత్తలు పడుతున్నారు. ఏలూరు, నూజివీడు, జంగారెడ్డిగూడెం, చింతలపూడి, నగర పంచాయతీల్లో బలమైన సామాజిక వర్గాలు తమకు మద్దతు పలికేలా జాగ్రత్తలు పడుతున్నారు.

కూటమి అంచనాలు ఏంటి ?

తమతమ నియోజకవర్గాల్లో తమకు ఎలాంటి మద్దతు లభిస్తుంది? ఏఏ వర్గాల నుంచి సానుకూలత ఉంది? యువత, రైతులు, మహిళల్లో ఎంతెంత శాతం తాము మొగ్గుచూపుతారనే దానిపై ఇప్పటికే పల్లె, పట్టణం తేడా లేకుండా తాము ప్రచారం చేసిన ప్రాంతాలన్నింటిలోనూ కూటమి అభ్యర్థులే కాకుండా అధికార వైసీపీ అంచనాలు వేస్తున్నారు. ప్రత్యేకించి జనసేనకు మద్దతు ఉన్న ప్రాంతాలపై అటు కూటమి, ఇటు వైసీపీ అటెన్షన్‌గా ఉన్నాయి. ఆత్యధికులు చేజారుతుండడం వైసీపీని కలవర పాటుకు గురిచేస్తోంది.

ఈ మూడు వారాలే కీలకం

రాబోయే మూడువారాలు పోటీచేసే అభ్యర్థులకు అత్యంత కీలకం. ఇప్పటికే నియోజక వర్గాల్లో అభ్యర్థులంతా రెండు,మూడుసార్లు ప్రచారం చేశారు. ఈసారి వ్యక్తిగత నిందలను పక్కనపెట్టి అధినేతలే లక్ష్యంగా అన్నిపార్టీల అభ్యర్థులు అస్త్ర శస్త్రాలు సంధిస్తూనే వచ్చారు. ఇప్పటికే అధికార పార్టీకి మూటలు వచ్చి పడ్డాయి. యంత్రాంగంలోనూ కొంతవారికి మద్దతు ఉన్నట్లు కనిపిస్తోంది. ఎక్కడా వెనక్కి తగ్గదు, జనం బలమే మనం బలం అనేరీతిలో కూటమి అభ్యర్థులు ఇప్పటికే స్వీయ సమీక్షలకు దిగుతున్నారు. ఒకటికి రెండుసార్లు పోలింగ్ బూత్‌ల స్థాయిలోనూ అంచనాలకు దిగుతున్నారు.


పట్టాభిషిక్తుడైన కోదండరాముడు

చనుబండలో వైభవంగా శ్రీరామ పట్టాభిషేకం

చాట్రాయి, ఏప్రిల్ 18 : అపర భద్రాద్రి చనుబండ కోదండరామస్వామి పట్టాభిషేకం ఆలయ కల్యాణ మండపంలో గురువారం వైభవంగా జరిగింది. ఆలయ నుంచి సీతారామలక్ష్మణుల విగ్రహాలను పల్లకీలో ఊరేగిస్తూ మంగళవాయిద్యాలతో జయ జయధ్వానాలతో కల్యాణ మండపానికి తీసుకొచ్చారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త పుచ్చకాయల చెన్నకేశవరెడ్డి దంపతులతో పాటు పలువురు దంపతులతో వేద పండితులు పట్టాభిషేక క్రతువులో భాగమైన హోమాలు, పూజలు నిర్వహించారు. రాష్ట్ర సహకార యూనియన్ చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, హైమావతి దంపతులు స్వామికి ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. భారీ అన్న సమారాధన జరిగింది.

పొగాకు ధరల పరుగు

- జంగారెడ్డిగూడెం-1లో కిలో రూ.257

బుట్టాయగూడెం, ఏప్రిల్ 18 : వర్జీనియా పొగాకు ధరలు గురువారం మార్కెట్‌తో పుంజుకున్నాయి. మార్చి 6వ తేదీన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని ఐదు వేలం కేంద్రాల్లో పొగాకు కొనుగోలు ప్రారంభం కాగా ప్రారంభ ధర గరిష్ఠంగా రూ.240లు నమోదైంది. కాగా అప్పటి నుంచి మందకొడిగా అమ్మకాలు జరుగుతున్నా లోగ్రేడ్ పొగాకుకు మంచి ధరలు పలికాయి. లోగ్రేడ్ కిలో రూ.225 నుంచి రూ.235 వరకు ధర పలికింది. ఈ క్రమంలో రైతాంగం అంతా లోగ్రేడ్ పొగాకును అధికంగా అమ్మకానికి తీసుకొచ్చారు. కాగా ఎ-గ్రేడ్ ధరలు గురు వారం కిలో రూ.250 మార్కును క్రాస్ చేసింది. దేవరపల్లి లో గరిష్ఠ ధర రూ.255, జంగారెడ్డిగూడెం-1లో రూ.257, జంగారెడ్డిగూడెం-2లో రూ.251, కొయ్యలగూడెంలో రూ.255, గోపాలపురంలో రూ.254 ధర పలికింది.

ఆ ఎంఈవో తీరే అంత!

- గణపవరం ఎంఈవో శేషు రూ.3.80 లక్షలు అవకతవకలకు పాల్పడ్డారని ఎస్టీయూ ఫిర్యాదు
- ఖండించిన ఎంఈవో.. విచారణ చేపడతామన్న డీఈవో


డీఈవో అబ్రహంకు వినతిపత్రం అందజేత

ఏలూరు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 18 : గణపవరం ఎంఈవో-1 పి.శేషు పనితీరుపై సమగ్ర విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) రాష్ట్ర, జిల్లా శాఖ నాయకులు గురువారం డీఈవో అబ్రహంకు ఫిర్యాదు చేశారు. ఎంఈవో అక్రమ వ్యవహారాలపై డీఈవోకు అందజేసిన ఫిర్యాదు నకళ్ళను ఇక్కడి పత్రికలకు అందజేశారు. దీనిపై డీఈవో అబ్రహంను వివరణ కోరగా ఎస్టీయూ నాయకులు చేసిన ఆరోపణలపై విచారణ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. తాను ఎటువంటి అక్రమాలకు పాల్పడలేదని, ఎంఈవోగా పనిచేసిన మండలాలన్నింటిలో చేపట్టిన అన్ని ఆర్థిక కార్యకలాపాలకు బిల్లులు ఆడిట్ కావడంతో పాటు, విచారణలో వాటిని ఉన్నతాధికారులకు అందజేస్తానని ఎంఈవో పి.శేషు వివరించారు. ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి నారాయణ, జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.శామ్యూల్, కె.ఆర్.పవన్ కుమార్ ఎంఈవోపై చేసిన ఫిర్యాదు ముఖ్యాంశాలివి. శేషు గణపవరం ఎంఈవోగా పనిచేస్తున్న కాలంలో అత్తిలి ఎంఈవో పేరిటవున్న బిల్లులను అప్‌లోడ్ చేసి రూ.60 వేలను తన ఖాతాలో జమ చేసుకున్నారు. ఎంఆర్‌సీ గ్రాంట్లు, శాలసిద్ధి గ్రాంట్లను కాజేశారు. నిడమర్రు ఎంఈవోగా పనిచేసిన కాలంలో సంతకాలను ఫోర్జరీ చేసి క్రమశిక్షణారాహిత్యానికి పాల్పడి నిధులను సొంత ఖాతాలో వేసుకున్నారు. స్పోర్ట్స్ గ్రాంట్లు, ఎంఆర్‌సీ గ్రాంట్ల బిల్లులను అప్‌లోడ్ చేయకుండా స్వాహా చేశారు. సమగ్ర అభ్యసనాభివృద్ధి పథకం(క్లాప్) శిక్షణ నిమిత్తం ప్రభుత్వం విడుదల చేసిన నిధులను నకిలీ బిల్లులు సృష్టించి సొంత ఖాతాకు మళ్ళించారు. నల్లజర్ల ఎంఈవో(ఎఫ్ఏసీ)గా పనిచేసిన కాలంలో ఎంఆర్‌సీ గ్రాంట్లు రూ.57 వేలు పూర్తిగా వినియోగించకుండా వాడేసుకున్నారు. శేషుపై చేసిన ఫిర్యాదుకు సంబంధించిన సీఎఫ్ ఎంఎస్ బిల్లుల ఐడీలను, వివరాలను ఎనెగ్జర్‌లో పొందుపర్చాం. రూ.3.80 లక్షలను దుర్వినియోగం చేశారు. ఆ ప్రకారం నకిలీ బిల్లులను సీఎఫ్‌ఎంఎస్‌లో అప్ లోడ్ చేసి ప్రభుత్వ నిధులను సొంత ఖాతాకు జమ చేసుకున్న ఎంఈవో శేషుపై నిర్వహించే విచా రణకు తాము పూర్తిగా సహకరిస్తామని ఎస్టీయూ నాయకులు డీఈవోకు వివరించారు. ఆయనపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఇక్కడే ఉంటా.. సమస్యలు తీరుస్తా..

- మీలో ఒక్కడిగా ఉంటూ సంక్షేమం, అభివృద్ధి చేసి చూపిస్తా
- ఓటుతో సైకో పాలనకు అంతం పలకాలి
- ఏలూరు పార్లమెంట్ కూటమి అభ్యర్థి పుట్టా మహేష్‌కుమార్‌యాదవ్


కొత్తూరులో పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఏలూరు పార్లమెంట్ కూటమి అభ్యర్థి పుట్టా మహేష్‌కుమార్ యాదవ్

పెదపాడు/కొయ్యలగూడెం, ఏప్రిల్ 18 : 'ఇక్కడే ఉండి మీ సమస్యలు తెలుసుకుని తీరుస్తాను, స్థానికంగా నివాసంతో పాటుగా మీ అందరికీ అందుబాటులో ఉండేందుకు కార్యాలయం ఏర్పాటు చేసుకుంటున్నాను' అంటూ ఏలూరు పార్లమెంట్ కూటమి అభ్యర్థి పుట్టా మహేష్ కుమార్ యాదవ్ కార్యకర్తలకు తెలిపారు. పెదపాడు మండలం కొత్తూరులో టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీ కార్యకర్తలు, నాయకులు ఆత్మీయ సమావేశం జనసేన నాయకుడు రాఘవయ్య చౌదరి ఆధ్వర్యంలో గురువారం జరిగింది. మహేష్ కుమార్ మాట్లాడుతూ 'రాష్ట్ర అభివృద్ధి, సంక్షే మం తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమితో సాధ్యం. కూటమి అభ్యర్థులకు అండగా నిలవాలి. మీలో ఒక్కడిగా ఉంటూ సంక్షేమం, అభివృద్ధి అంటే ఏమిటో చేతల్లో చేసి చూపిస్తాను. ఇందుకోసం కార్యాలయం వద్ద ప్రత్యేకమైన ఏర్పాటుతో ప్రతిరోజూ నా దృష్టికి వచ్చే సమస్యలు, వాటి పరిష్కారం దృష్టి సారించేలా ముందుకెళ్తాను. మీ రెండు ఓట్లు కూటమి అభ్యర్థులకు వేసి రాష్ట్రంలో సైకో పాలనకు అంతం పలకాలి' అంటూ పిలుపునిచ్చారు. టీడీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ ప్రజలంతా చంద్రబాబు పాలన కోసం ఎదురు చూస్తున్నారని, మరికొద్దిరోజుల్లోనే రాష్ట్రంలో ఆ దిశగా తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పాటు కాబోతుందన్నారు. దెందులూరు మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని అసెంబ్లీ, ఎంపీ స్థానాలను గెలిచే విధంగా పార్టీ శ్రేణులు ఇంటింటికి వెళ్లి చంద్రబాబు సంక్షేమ పథకాలను వివరించాల్సిన అవసరముందన్నారు. ఏలూరు కూటమి అభ్యర్థి బడేటి చంటి, దెందులూరు, ఏలూరు జనసేన పార్టీ ఇన్‌చార్జిలు ఘంటశాల వెంకటలక్ష్మి, రెడ్డి అప్పలనాయుడు, కొత్తూరు రాజు, కొత్తూరు చినబాబు, గుత్తా అనిల్, తాతా సత్యనారాయణ, సైదు సత్యనారాయణ, లావేటి శ్రీనివాస రావు, అక్కినేని వంశీ కృష్ణ, పెద్ద సంఖ్యలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయ కులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పోలవరం సాధించాలంటే. కూటమి అభ్యర్థులను గెలిపించాలి

రాబోయే ఎన్నికల్లో పోలవరం అమరావతి సాధించాలంటే కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఏలూరు పార్లమెంట్ కూటమి ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్‌యాదవ్, పోలవరం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి చిర్రి బాలరాజు కోరారు. కొయ్యలగూడెం మండలంలోని నర్సన్నపాలెం దండమూడి ఫంక్షన్ హాలులో టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన, బీజేపీ ఆత్మీయ సమావేశం జరిగింది. ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు మాట్లాడుతూ రాష్ట్రంలో దుష్టపరిపాలనకు చమరగీతం పాడాలన్నారు. పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయడమే తమ లక్ష్యమని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు అంకితభావంతో గ్రామాల్లో ప్రచారం చేసి ఉమ్మడి అభ్యర్థులను గెలిపించుకోవాలని గన్ని పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే మొడియం శ్రీనివాస్, జనసేన నాయకులు కరాటం సాయిబాబు, బీజేపీ నాయకులు నాగరాజు, బొల్లిన నిర్మలకిషోర్, టీడీపీ నాయకులు మేఘలాదేవి, నియోజకవర్గాల మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


చెరువులో తేలియాడుతున్న చనిపోయిన చేపలు


నీళ్లులేక మృత్యువాత


- తక్కెళ్లపాడు మంచినీటి చెరువులో చేపలు మృతి


మండవల్లి, ఏప్రిల్ 18 : పాలకుల అలసత్వమో.. అధికారుల నిర్లక్ష్యమో.. తెలీదు గానీ లక్షలు విలువ చేసే చేపలు మృతి చెందాయి. తక్కెళ్లపాడు గ్రామంలోని మంచినీటి చెరువులో గురువారం ఈ సంఘటన చోటు చేసుకుంది. కొల్లేటిలంక గ్రామాలకు మంచినీరు సరఫరా చేసే తక్కెళ్ళపాడు రక్షిత మంచినీటి పథకం చెరువులో నీటిమట్టం తగ్గిపోగా రెండు రోజులుగా మండుటెండలకు చెరువులో చేపలు తట్టుకోలేక ఆకస్మాత్తుగా మృతిచెందాయి. చెరువులోని చేపలు పట్టుబడికి వచ్చాకా వేలం నిర్వహిస్తారు. చెరువులో చేపలు ఉన్నప్పుడు నీరు తగ్గుతున్న పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడం వల్లే సుమారు రూ.నాలుగు లక్షల నుంచి రూ.ఐదు లక్షల విలువైన చేపలు మృతి చెందినట్టు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. చేపలు చనిపోవడం వల్ల చెరువులోని నీరు కలుషితమైందని తాగడం మాట ఎలా ఉన్నా.. వినియోగించుకోవడానికి కూడా పనికి రావడం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువులో చనిపోయిన చేపలను తొలగించాలని కోరుతున్నారు.

జగన్మోసం


టిడ్కో ఇళ్లు


ఎర్రకాలువ జలాశయం


కూలిన బైనేరు వంతెన (ఫైల్)


చింతలపూడిలో వెలగని వీధిలైట్లు

సమస్యలతో సతమతం

చింతలపూడి


నిలిచిపోయిన చింతలపూడి ఎత్తిపోతల కాల్వ పనులు

చింతలపూడి నియోజకవర్గ కేంద్రంలో అన్నీ చింతలే.. తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం, మురుగుతో పట్టణ ప్రజలు ఏళ్ల తరబడి ఇబ్బందులు పడుతున్నారు. నియోజకవర్గంలో మరో పట్టణం జంగారెడ్డిగూడెంలో ఏళ్ల తరబడి సమస్యలు విలయతాండవం చేస్తున్నాయి. సీఎం జగన్‌మోహన్ రెడ్డి, వైసీపీ నేతలు 2019 ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయలేదు. ప్రస్తుతం అవే హామీలతో ప్రచారానికి దిగడం విడ్డూరం. జంగారెడ్డిగూడెం పట్టణంలో తాగునీరు, అంతర్గత రహదారులు, డ్రెయినేజీ రోడ్ల సమస్యలు అసంపూర్తిగా ఉన్నాయి. కామవరపుకోట, లింగపాలెం మండలాల్లో సైతం హామీలు అమలు కాలేదు.. సమస్యలు పరిష్కారం కాలేదు.

\- చింతలపూడి, జంగారెడ్డిగూడెం, లింగపాలెం

- టిడ్కో ఇళ్లు ఇవ్వలేదు
- ఎత్తిపోతల పథకం ముందుకు సాగలేదు
- ఎర్ర కాలువ కష్టాలు
- అసంపూర్తిగా పట్టెన్నపాలెం బ్రిడ్జి
- ఆర్టీసీ బస్ డిపో కలే..

చింతలపూడి ఉత్తిపోతలు..!

గోదావరి నీటిని ఎత్తిపోతల ద్వారా మళ్లించి సాగు, తాగునీరు ఇవ్వాలని 2006లో ఈ పథకానికి అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి శ్రీకారం చుట్టి 1701 కోట్లు కేటాయించారు. 2014లో ఈ పథకాన్ని టీడీపీ ప్రభుత్వం విస్తరించి కృష్ణా జిల్లా మెట్ట ప్రాంతాలకు మళ్లించాలని 3వేల కోట్లతో పనులు చేపట్టారు. వైసీపీ ప్రభుత్వంలో నాబార్డు నుంచి రూ.1950 కోట్లు రుణం పొందినా ఈ పథకాన్ని పూర్తి చేయలేదు. పాదయాత్రలో జగన్ ఇచ్చిన హామీ నిలబెట్టుకోలేదు. పరిహారం పెంచి ఇవ్వాలన్న రైతుల డిమాండ్ నెరవేరక ఇప్పటికీ పోరాటాలు చేస్తూనే ఉన్నారు. ఇటీవల నిర్మాణం నిలిచిపోయిన కాలువ మట్టిని కూడా ప్రభుత్వం అమ్ముకుంటోంది.

ఎక్కడి టిడ్కో అక్కడే..

పేదల ఇంటి కల నిజం చేయడానికి తెలుగుదేశం ప్రభుత్వం నిర్మించిన టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందించడంలో వైసీపీ ప్రభుత్వం విఫలమైంది. జంగారెడ్డిగూడెంలో 2016లో 864 టిడ్కో గృహ సముదాయాల నిర్మాణం చేపట్టారు. 2019 ఎన్నికల సమయానికి నిర్మాణం చివరి దశకు వచ్చింది. నాటి నుంచి పనులు అడుగు కూడా ముందుకు కదల్లేదు. వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి తేదీలు మార్చుతూ ప్రజలను మభ్య పెట్టింది. రంగులు మార్చి రిజిస్ట్రేషన్ పేరుతో పేదలను మోసం చేశారు.

బైనేరు వంతెన కూలి ఆరేళ్లు..

2018 ఆగస్టులో కురిసిన భారీ వర్షాలకు బైనేరు వంతెన కుప్పకూలింది. బ్రిటీష్ కాలంలో నిర్మించిన 125 ఏళ్ల వంతెన తెగిపోవడంతో వాహనదారుల ఇబ్బందులు అన్నీ ఇన్నీ కాదు. నూతన బ్రిడ్జి నిర్మాణం సంగతి పక్కనపెడితే, స్థానిక ప్రజాప్రతినిధులు పడిపోయిన బ్రిడ్జి మరమ్మతు చేయిస్తామంటూ ప్రకటనలు చేశారు. ఇప్పటికి కూలిన బ్రిడ్జి శిథిలాలు మాత్రమే తొలగించారు.

స్వచ్ఛ లక్కవరం జాడ లేదు

జంగారెడ్డిగూడెం మండలం లక్కవరం గ్రామానికి ప్రత్యేకత ఉంది. 18వేల మంది జనా భా, 8వేల పైచిలుకు ఓట్లు ఒక్క లక్కవరం లో ఉన్నాయి. నాయకులు ఓట్ల కోసం లక్కవరం గ్రామాన్ని స్వచ్ఛ గ్రామంగా చేసి చూపిస్తామంటూ హామీలు గుప్పిం చారు. తీరా చెత్త సేకరణ వాహనాలు లేక చెత్త లక్కవరంగా మా రిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నా రు. పాత డంపింగ్ యార్డు ఉన్న ప్పటికి కొత్త డంపింగ్ యార్డు నిర్మాణం చేపట్టారు. రెండు డం పింగ్ యార్డులను వినియోగిం చకపోగా రోడ్డుపైనే చెత్తను కుప్పలుగా పేర్చి తగలబెడుతున్నారు.

ఎర్రకాలువ ఆధునీకరణ లేదు

ఎర్రకాలువ జలాశయం ఆధునీకరణ చేస్తా మని సీఎం హామీ ఇచ్చారు. కనీస మరమ్మ తులు కూడా చేయించ లేదు. ప్రాజెక్టు కనీస నిర్వహణ లేదు. ఎర్రకాలువ సాగు పరిధి పెంచాల్సిన అవసరం ఉందని తెలిసినా పట్టించుకోవడం లేదు. వైసీపీ ప్రభుత్వం తాగునీరు, సాగునీరు ప్రాజెక్టులను పట్టించుకోదని రైతులు వాపోతున్నారు.

8 ఏళ్లుగా నిర్మాణం..

2016లో ప్రారంభించిన పట్టెనపాలెం బ్రిడ్జి నిర్మాణం పూర్తి కాలేదు. జల్లేరువాగుపై పట్టెన్నపాలెం బ్రిడ్జి గుండా గుబ్బల మంగ మ్మ ఆలయానికి నిత్యం భక్తులు వెళ్తుంటారు. బ్రిడ్జి నిర్మాణం జరగక వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు.

సమస్యల స్థాయి పెంపు..

పంచాయతీ నుంచి నగర పంచాయతీ స్థాయికి పెరిగిన చింతలపూడికి పేరుకే పట్టణ హోదా. సౌకర్యాల కల్పనలో మారుమూల గ్రామకంటే అధ్వానం. మౌలిక సదుపాయాలు లేవు.. అడుగుదామంటే పాలకవర్గ ఎన్నికలే లేవు. ఇళ్ల పన్ను, చెత్త పన్ను బాదేస్తున్నారు. తాగు నీరు లేదు, డ్రెయినేజీ సౌకర్యం లేదు. పట్టణంలో వీధి దీపాలు కూడా వెలగవు. ఎటు చూసినా ఆరు కిలోమీటర్ల పరిధిలోని పట్టణంలో సరైన రోడ్డు లేదు. పట్టణంలో 20 వార్డులు, 35 వేలకు పైగా జనాభా ఉన్నారు. అధిక శాతం దళితవాడలు ఉన్నా నిధుల శాపమో.. నాయకుల నిర్లక్ష్యమో అభివృద్ధి మాత్రం శూన్యం.

ధరల స్థిరీకరణ ఏదీ?

అధికారంలోకి వస్తే ఏటా బడ్జెట్‌లో 3వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటుచేసి రైతును రాజును చేస్తానని చెప్పిన వైసీపీ ప్రభుత్వం చివరికి నట్టేట ముంచింది. దేశంలోనే పామాయిల్ సాగు రాష్ట్రంలో అధికం కాగా రాష్ట్రంలో ఏలూరు జిల్లాలో ఎక్కువ విస్తీర్ణంలో పామాయిల్ సాగవుతోంది. పామాయిల్ ధర తెలంగాణ కన్నా ఎక్కువ అందిస్తానని గత ఎన్నికల ముందు జగన్మోహన్ రెడ్డి హామీ ఇచ్చారు. గతేడాది అత్యధిక ధర రూ.23 వేలు పలికిన పామాయిల్ ధర ప్రస్తుతం రూ.11 వేలకు పడిపోయింది. విదేశాల నుంచి ఆయిల్ దిగుమతి ఎక్కువ అవడంతో పామాయిల్ ధరలు పడిపోతున్నాయి. ధరల స్థిరీకరణ నిధితో ఆదుకుంటానన్న ప్రభుత్వం పామాయిల్ రైతుల ఊసు ఎత్తడంలేదు.

బస్సు డిపో ఏర్పాటు కల..

జిల్లాలోనే పెద్ద నియోజకవర్గమైన చింతలపూడి తెలంగాణ రాష్ట్ర సరిహద్దులో ఉంది. నియోజకవర్గ కేంద్రంలో బస్సు డిపో ఏర్పాటు చేయాలని ఈ ప్రాంత ప్రజలు 1975 నుంచి డిమాండ్ చేస్తున్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా కలగానే మిగిలింది. 1990లో వామపక్ష పార్టీలు డిపో ఏర్పాటు చేయాలని 40 రోజులపాటు రిలే దీక్షలు నిర్వహించారు. గతంలో ఉన్న బస్సు సర్వీసులను రద్దు చేశారు. ఎమ్మెల్యే ఎలీజా రవాణా మంత్రి దృష్టికి రాజధాని విజయవాడకు ఒక్క బస్సు అయినా ఏర్పాటు చేయండని చెప్పినా ఉపయోగం కలుగలేదు. ఈ సమస్య ఈ ప్రాంత ప్రజలకు కలగానే మిగిలింది.

నెరవేరని హామీలు..

చింతలపూడి పట్టణంలో ప్రతిపక్ష హోదాలో వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పాదయాత్రలో హామీలు గుప్పించారు. తమ ప్రభుత్వం వస్తే చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తిచేసి రైతులకు న్యాయం చేస్తామన్నారు. నిర్వాసిత రైతులు ఆయనను కలిసినా పరిష్కారం కాలేదు. ఆయిల్‌పాం రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తామని, లేదంటే నిధులు కేటాయించి ఎంఐపీ ద్వారా న్యాయం చేస్తామని ఇచ్చిన హామీ నెరవేరలేదు. సీతానగరం-బోయగూడెం రోడ్డు హామీ కూడా నెరవేరలేదు. వంద పడకల ఆసుపత్రి నిర్మాణం హామీ నెరవేరలేదు.

వెలగని వీధి దీపాలు

2005లో చింతలపూడి మెయిన్ రోడ్డు విస్తరించి నాలుగు లైన్ల రోడ్డుగా అభివృద్ధి చేశారు. 2008లో రూ. కోటితో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు. ఇవి ప్రారంభించిన రోజు మాత్రమే వెలిగాయి. తరువాత మరమ్మతుల పేరిట నిధులు మెచ్చించారు తప్ప ఏ రోజునా వీధి దీపం వెలిగితే ఒట్టు. ఐదేళ్లలో విద్యుత్ వెలుగుల ఊసే లేదు. రాత్రివేళ పట్టణ ప్రజలు బస్సు దిగి చీకటిలో ఇంటికి వెళ్లాల్సిందే. నగర పంచాయతీ అయినా కనీసం వీధి దీపానికి కూడా నోచుకోలేదని పట్టణ ప్రజలకు నిరాశే మిగిలింది.

రోడ్డు.. శిలాఫలకంతో సరి..

బోయగూడెం-సీతానగరం రోడ్డు నిర్మాణం 20 ఏళ్లుగా శిలాఫలకాలకే పరిమితమైంది. ఈ మార్గంలో మూడు పంచాయతీలు, 11 శివారు గ్రామాలు, 17 కిలోమీటర్ల రోడ్డు అధ్వానంగా ఉంది. 20 ఏళ్లల్లో నలుగురు ఎమ్మెల్యేలు రోడ్డు వేయలేకపోయారు. 2018లో అప్పటి సీఎం చంద్రబాబు రూ.8 కోట్లు మంజూరు చేస్తూ శిలాఫలకం వేస్తే వైసీపీ ప్రభుత్వంలో దానిని పడగొట్టి ఆనవాలు లేకుండా చేశారు. లింగపాలెం మండలంలో ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు వేయిస్తానని, డ్రెయినేజీలు కట్టిస్తానని వైసీపీ ఎమ్మెల్యే హామీలు ఇచ్చారు. ఏ ఒక్కటీ నెరవేర్చలేదు. గ్రామాల్లో కొత్తబోర్లు వేయించి తాగునీరు అందిస్తామన్న హామీ మరిచిపోయారు. గ్రామాల్లో ఆసన్నగూడెం, బాదరాల, రంగాపురం, కొత్తపల్లి, అన్నపనేనివారిగూడెం, కొణిజర్ల, నరసన్నపాలెం, కలరాయనగూడెం, బోగోలు రోడ్లు రాళ్లు, గోతులతో ప్రమాదకరంగా మారాయి. ఎన్నికల్లో గెలవగానే వీటన్నింటిని పరిష్కరిస్తామన్న ఎమ్మెల్యే హామీ ఇప్పటివరకు అతీగతీ లేదు.

నామినేషన్లకు

ముహూర్తాలివే..



నామినేషన్ ప్రక్రియతో ఎన్నికల సంరంభం ఊపందుకుంది. ప్రధాన రాజకీయ పార్టీలు తమ అభ్యర్థులను ఎప్పుడో ప్రకటించాయి. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో నామినేషన్ల దాఖలుకు అభ్యర్థులు ముహూర్తం చూసుకున్నారు. తొలిరోజునే కొందరు నామినేషన్ దాఖలు చేయగా మరికొందరు మంచి ముహూర్తం కోసం వేచి ఉన్నారు. అభ్యర్థులు పురోహితులు, పంచాంగకర్తలు, సిద్ధాంతిలను సంప్రదిస్తున్నారు. పేరు బలం, తారాబలం, నక్షత్ర బలం ప్రకారం తమకు ఏది మంచి ముహూర్తాల్లో తెలుసుకుని వారు నామినేషన్ పత్రాలను దాఖలు చేయటానికి సిద్ధం అవుతున్నారు. గురువారం దశమి మంచిది కావడంతో ఏలూరు జిల్లాలో అసెంబ్లీకి ఆరు, పార్లమెంట్‌కు ఒక నామినేషన్ కూడా దాఖలయ్యాయి. మిగిలిన రోజుల్లో మంచి ముహూర్తాలను ఎంచుకునే పనిలో అభ్యర్థులు నిమగ్నమయ్యారు. రాబోయే రోజుల్లో ఉన్న మంచి ముహూర్తాలతో తమకు అనువుగా ఉన్న రోజులను చూసుకుని అభ్యర్థులు తమ నామినేషన్లను దాఖలు చేసే అవకాశాలున్నాయి.

5 రోజులు మంచి ముహూర్తాలు

కాశీభొట్ల పార్వతీశ్వర శర్మ, పంచాంగ కర్త

నామినేషన్లు దాఖలు చేయడానికి ఈసారి 7 రోజులు సమయం ఉండగా మంచి రోజులు 6 ఉన్నాయి. గురువారం దశమి కావడంతో పలువురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. మిగిలిన రోజుల్లో 19, 22, 23, 24, 25 తేదీలలో మంచి ముహూర్తాలు ఉన్నాయి. అభ్యర్థులు తమ పేరు బలం, తారాబలం, నక్షత్ర బలం ఆధారంగా ముహూర్తాలు చూసుకోవాల్సి ఉంది. శుక్రవారం ఏకాదశి పర్వదినం. ఈనెల 22న సోమవారం హస్తా నక్షత్రం, ఈనెల 23 మంగళవారం పూర్ణిమ, చిత్త నక్షత్రం. ఈనెల 24న బుధవారం స్వాతి నక్షత్రం, ఈనెల 25న నామినేషన్లు చివరి తేదీ గురువారం విదియ, విశాఖ నక్షత్రం ఉండటంతో అవి మంచి ముహూర్తాలుగా పేర్కొనవచ్చు.

\- ఏలూరు సిటీ

నవతరం ఓటర్

ఉద్యోగావకాశాలు కల్పించే వారికే ఓటు



యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించే వారికే ఓటు వేయాలని నిర్ణయించుకున్నా. తొలిసారి ఓటు పొందినందుకు ఎప్పుడెప్పుడు ఓటు వేయాలా అని ఉంది. పరిపాలకులను ఎన్నుకునే స్వేచ్ఛ ప్రజాస్వామ్యం మాకు కల్పిస్తోంది. ప్రభుత్వం నుంచి ఉన్నత విద్య సౌకర్యాలు, మెరుగైన కెరియర్ ఆశిస్తున్నాం. యువతకు మేలు చేసేవారికే మా ఓటు.

\- పి.కావ్య, హనుమంతులగూడెం, నూజివీడు మండలం

యువ నాయకత్వం కావాలి



నా ఓటు నోటుకు అమ్ముకోను. మెరుగైన పాలన కావాలంటే ఓటు ద్వారానే సాధ్యం రాష్ట్రం పురోగతి సాధించాలంటే యువ నాయకత్వం కావాలి. అవినీతి రూపుమాపే నాయకుడికే నా తొలి ఓటు వేస్తాను. యువత మేల్కొనే సమయం వచ్చింది. ప్రధానంగా విద్య, యువతకు ఉద్యోగాలపై ప్రభుత్వం దృష్టి సారించాలి. రాష్ట్రాన్ని అభివృద్ధి దిశలో నడిపించే సత్తా ఉన్న నాయకుడికే ఓటు వేస్తున్నా. మొదటిసారి నాకు ఓటర్ గుర్తింపు కార్డు వచ్చింది.

\- శశి వెంకట్, శనివారపుపేట, ఏలూరు

చదువుకు తగిన ఉద్యోగం కల్పించాలి



యువతకు చదువుకు తగ్గ ఉద్యోగం, ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. మెరుగైన విద్యా సౌకర్యాలు కల్పించాలి. ప్రధానంగా గ్రామీణ యువతకు ఉన్నత విద్య మరింత చేరువ కావాలి. చదువుకున్న విద్యార్థులకు మంచి ఉద్యోగాలు వచ్చి స్థిరపడినప్పుడే అభివృద్ధి సాధ్యం. అలాంటి ప్రభుత్వానికి మా మద్దతు ఉంటుంది.

\- మానేపల్లి సూరజ్, ఆగిరిపల్లి

సీనియర్ ఓటర్

నా ఓటు వారికే..



70వ దశకం నుంచి ఎన్నికల్లో ఓటే వేస్తున్నా. నాడు ప్రజలకు సమస్యల పరిష్కారానికి కృషి చేసిన, ప్రజలకు అండగా నిలిచిన నాయకుని వెంటే ప్రజా బాహుళ్యం ఉండేది. నాటికి నేటికి ఎన్నికల చిత్రంలో ధనప్రవాహం పెరిగింది. అయినా పాతతరం ఓటర్లు ఎక్కువ భాగం ప్రజా సమస్యలపై పోరాడేవారికి అండగా నిలుస్తాం. అలాంటి వారికే ఓటే వేస్తా.

\- అత్తి వెంకటేశ్వరరావు, బత్తులవారిగూడెం నూజివీడు మండలం

ఉచిత పథకాలు ఎవరడిగారు..



అనవసరమైన ఉచిత పథకాలు ప్రజలపై రుద్దుతున్నారు. ఎవరడిగారు.. ఉచితంగా ఇవ్వాల్సినవి ఏమిటి? ప్రభుత్వం అప్పులపాలై ఆ అప్పులు తీర్చేందుకు తిరిగి పన్నులను పెంచుతూ ప్రజలపై మోయలేని భారం మోపడం ప్రభుత్వాలకు తగదు. ప్రజలకు, ప్రభుత్వానికి భారం కాకుండా సంక్షేమం అమలు చేయాలి. ప్రజలను తామే ఉద్ధరిస్తున్నామని చెప్పుకునే వారికి మద్దతు ఇవ్వను.

\- మడుపల్లి సుజాత, ఆగిరిపల్లి

భవిష్యత్‌కు భరోసా ఇవ్వాలి



భవిష్యత్‌కు భరోసా కల్పిస్తూ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే నాయకుడికే ప్రాధాన్యం ఇస్తా. నేతల ఎన్నికల హామీలు కార్యరూపం దాల్చడం లేదు. ఎన్నికల్లో ఎలాంటి ప్రలోభాలకు లొంగొద్దు. రాష్ట్రాన్ని అభివృద్ధి దిశలో నడిపించాలంటే ఆ దిశగా ప్రజలు ఆలోచించి భవిష్యత్‌కు ప్రాధాన్యం ఇచ్చేవారికి ఓటు వేయాలి.

\- సీహెచ్.చంద్రరావు, ఏలూరు

ఆయ్.. అలాగేనండి..!



ఆ నేతల తీరే వేరు

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

ఉండి నియోజకవర్గంలో కీలక నాయకుల వ్యవహారం అభ్యర్థులకు అంతుచిక్కడం లేదు. ఏ పార్టీ అభ్యర్థి వెళ్లినా అయ్.. అలాగేనండి అంటున్నారు, మీకే మద్దతు అంటూ చెవిలో చెబుతున్నారు. కానీ ఇంటి గడప దాటరు. అభ్యర్థులను సాదరంగా ఆహ్వానిస్తున్నారు. తిరిగి ఊరి పొలిమేర వరకు సాగనంపుతున్నారు. అటువంటి నాయకులు అంతా తమ వెంటే ఉన్నారంటూ అభ్యర్థులు సంబర పడిపోతున్నారు. ఇప్పటివరకు ఉండిలో తెలుగుదేశం తరపున రామరాజు ప్రచారం చేశారు. స్వతంత్ర అభ్యర్థిగా శివరామరాజు, వైసీపీ అభ్యర్థిగా పీవీఎల్ నరసింహరాజు గ్రామాల్లో పర్యటించారు. అందరినీ ఆ నాయకులు తమ ఇంటి వద్ద ఆదరించారు. ఎన్నికల్లో మద్దతు ఇస్తామంటూ చిరునవ్వులు చిందిస్తున్నారు. మరోవైపు కూటమి అభ్యర్థి రఘురామకృష్ణంరాజు అవుతారంటూ ప్రచారం జరగడంతో ఆయనకు కూడా తమ మద్దతు ఉంటుందని సంకేతాలు పంపుతున్నారు. ఇటువంటి నాయకులు ఇప్పుడు తెలుగుదేశం, వైసీపీలో కూడా ఉన్నారు. రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలో పార్టీ పదవులు అనుభవించారు. ఇప్పటికీ పార్టీ పదవుల్లో ఉన్నారు. నామినేటెడ్ పోస్టులను అనుభవిస్తున్నారు. అటువంటి నాయకులపై ఇప్పుడు నియోజకవర్గంలో చర్చ జరుగుతోంది. గతంలో మాదిరిగా ఎన్నికల ప్రచారంలో బయటకు రావడం లేదు. తాము ఏ పార్టీకి మద్దతు ఇస్తామనేది స్పష్టంగా చెప్పడంలేదు. అంతా స్తబ్దుగా ఉన్నారు. వారివద్దకు వచ్చే అభ్యర్థులందరికీ మర్యాద ఇస్తున్నారు.

ఓటరు మాట

నీరిస్తే.. ఓటేస్తాం!


నాయకులకు మంచినీటి సమస్య వివరిస్తున్న మహిళలు

తాగునీటి పై పుట్లచెరువు మహిళల మొర..

ఎన్నికలు వచ్చాయి.. నాయకులు ప్రత్యక్షమవుతున్నారు. తాగేందుకు గుక్కెడు నీళ్ల ఇవ్వండి.. చాలు ఓటేస్తాం అంటున్నారు పుట్లచెరువు మహిళలు. అంటూ ఆనాడు వైసీపీ నేతలు మొరపెట్టుకున్నాం. ఇచ్చిన హామీ మేరకు ఓట్లు వేశాం. తర్వాత మాకు ఇచ్చిన హామి నీటి మూటగానే మిగిలింది. మంచినీటి మాటే పట్టించుకున్న నాథుడే కరువయ్యాడు. మళ్లీ ఎన్నికలు వచ్చేశాయి సమస్య అలాగే ఉంది. ఈ సారైన మాకు మంచినీళ్ల ఇవ్వండి... మా ఓట్లు మీకే వేస్తాం అంటూ గురువారం పుట్లచెరువులో ఎన్నికల ప్రచారం చేస్తున్న టీడీపీ, జనసే, బీజేపీ నాయకుల వద్ద తమ మొరపెట్టుకున్నారు. గత ఎన్నికల్లో వైసీపీ మాటలు నమ్మి మోసపోయామని అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో టీడీపీ, జనసేన, బీజేపీ సమక్షంలోనే కైకలూరు కూటమి అభ్యర్థి కామినేని శ్రీనివాస్‌కు ఫోన్‌లో పరిస్థితిని వివరించారు. మంచినీటి పరిష్కరించేందుకు తన శాయశక్తుల కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం గ్రామంలో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

\- మండవల్లి

భయం లేకుండా ఓటేయండి

స్వేచ్ఛగా ఓటు వేసేందుకు పోలీసు, సాయుధ బలగాలు ఓటర్లకు అండగా ఉన్నారు. లింగపాలెం మండలం యడవల్లి, అన్నపనేనివారిగూడెం గ్రామాల్లో సాయుధ దళాలతో గురువారం కవాతు నిర్వహించారు. చింతలపూడి సీఐ ఎం.సుధాకర్ మాట్లాడుతూ ఎన్నికల్లో భయం లేకుండా ఓటేయడానికి రక్షణగా ఉంటామన్నారు. అందరూ నిబంధనలు పాటించాలని సూచించారు. ఓటుహక్కును ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని అన్నారు. ఎటువంటి గొడవలు లేకుండా ఎన్నికల ప్రక్రియను కొనసాగించాలని కోరారు. ధర్మాజీగూడెం ఎస్సై పి.చెన్నారావు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

\- లింగపాలెం


సాయుధ దళాల కవాతు

ముసుగు ఎగిరిపోయింది..



ఉండి, ఏప్రిల్ 18: ఎన్నికల కోడ్‌లో భాగంగా అధికారులు రాజకీయ నేతల విగ్రహాలకు, శిలాఫలకాలకు ముసుగులు వేశారు. అయితే ఇంకా ఎన్నికలు ముగియకుండానే కొన్నిచోట్ల ముసుగులు తొలగిపోతున్నాయి. ఉండి ప్రధాన సెంటర్ పంట కాలువను చేరుకుని వున్న ప్రాంతంలో దివంగత సీఎం రాజశేఖర్‌రెడ్డి ఆవిష్కరించిన శిలాఫలకం కనిపించకుండా కట్టిన క్లాత్ ఊడిపోయింది. దీని పక్క నుంచే తరుచూ అధికారులు వెళ్తున్నా దీన్ని గమనించడం లేదు.

సెంటిమెంట్



ఎన్నికల్లో ఎవరూ నిలబడినా..
గొంది నుంచే ప్రచారం

నరసాపురం నియోజకవర్గానికి ఈశాన్యంలో ఉన్న గ్రామం గొంది, యలమంచిలి మండలానికి ఆనుకుని ఉన్న ఈ గ్రామం మైనర్ పంచాయితీ, అయితే ప్రతి పార్టీకి ఈ గ్రామం సెంటిమెంట్, పార్టీలకు సంబంధించి ఏ కార్యక్రమాలైనా ప్రారంభించాలన్న ముందుగా ఇక్కడ నుంచి ప్రారంభిస్తారు, ఈ సెంటిమెంట్ ఎన్నికల ప్రచారంలో కూడా కొనసాగిస్తారు, సీటు ప్రకటించగానే ముందుగా ఈ గ్రామంలోకి వినాయక గుడిలో పూజలు చేస్తారు ఆ తరువాత మాజీ సర్పంచ్ నాగేంద్ర ఇంటికి వెళ్లతారు.ఆక్కడ అల్పాహారం చేసిన తరువాత ప్రచారాన్ని మొదలుపెడతారు. ఇది ప్రతి ఎన్నికల్లోనూ జరిగే సెంటిమెంట్, దీంతో ఆ గ్రామస్థులు కూడా పార్టీలను పక్కన పెట్టి వచ్చిన ప్రతి నాయకులు వెంట ప్రచారం మొదలుపెట్టే వరకు ఉంటారు. గ్రామస్థులు కూడా ఎన్నికల వరకే పార్టీలతో రాజకీయం చేస్తారు. ఆ తరువాత అంతా ఒక్కతాటిపై ఉంటారు. గెలిచిన తరువాత ఏ నాయకుడు గ్రామానికి వచ్చిన అంతా సాధారంగా ఆహ్వానిస్తారు.

-నరసాపురం రూరల్

నందమూరు వెంకన్న గుడిలో పూజలు చేసి..



తాడేపల్లిగూడెం నియోజక వర్గంలో ఎవరు ఎన్నికల ప్రచారం ప్రారంభించినా మండలంలో ఓ మూలన ఉండే ఆ గ్రామం నుంచే ప్రారంభించడం ఆనవాయితీ. అదే తాడేపల్లిగూడెం మండలం నందమూరు గ్రామం. ఈ గ్రామం నియోజకవర్గానికి ఈశాన్యంలో ఉండటం కారణంగా ఇక్కడి ప్రచారం ప్రారంభించడం సెంటిమెంట్‌గా మారింది. ఈ గ్రామంలో పురాతన వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహించి ఇక్కడి ప్రజల ఆశీర్వచనాలు తీసుకుని ప్రచారంలో ముందుకు వెళతారు.

-తాడేపల్లిగూడెం రూరల్

హ్యాట్రిక్

నరసాపురం నుంచి హ్యాట్రిక్ ఎమ్మెల్యే !



నియోజకవర్గ చరిత్రలో మూడు సార్లు ఎన్నికై హ్యాట్రిక్ సృష్టించిన ఘనత మాజీ మంత్రి కొత్తపల్లికే దక్కింది. టీడీపీ అభ్యర్థిగా 1989, 1994, 1999 ఎన్నికల్లో వరుసగా విజయం సాధించి హ్యాట్రిక్ సృష్టించారు. ఈ రికార్డుతో పాటు అత్యధిక కాలం ఎమ్మెల్యేగా పని చేసిన ఘనత కొత్తపల్లికే దక్కింది. 1989 నుంచి 2009 వరకు సుమారు 30 ఏళ్లు ఎమ్మెల్యేగా పనిచేశారు. - నరసాపురం

ఇదీ సంగతి

ఆ..ముగ్గురూ దేవదాయశాఖ మంత్రులే..

రాష్ట్ర రాజకీయాల్లో తాడేపల్లిగూడెం నియోజకవర్గానిది ప్రత్యేకస్థానం.ఇప్పటి వరకూ 18 సార్లు ఎన్నికలు జరిగితే ముగ్గురు మంత్రులుగా నిలిచారు. ఈలి ఆంజనేయులు, పైడికొండల మాణిక్యాలరావు, కొట్టు సత్యనారాయణ మంత్రులుగా చేశారు. ఈ ముగ్గురు మంత్రులకు కూడా దేవదాయశాఖ కేటాయించడం విశేషం. దీంతో తాడేపల్లి గూడెం ఎప్పుడు మంత్రివర్గ విస్తరణలో చర్చ వచ్చినా దేవదాయశాఖ కన్ఫమ్ అనే చర్చలు జోరుగా సాగుతుంటాయి. మరోవైపు ఇదే జిల్లాకు చెందిన దండు శివరామరాజు కూడా దేవదాయ శాఖ మంత్రిగా పనిచేశారు. - తాడేపల్లిగూడెం రూరల్

నరసాపురం నియోజకవర్గానికి రాష్ట్రంలోనే ప్రత్యేకత ఉంది. ఆసెంబ్లీ, పార్లమెంట్ రెండు ఈ నియోజకవర్గం పేరునే ఉన్నాయి. జిల్లాకు శివారునున్న ఈ నియోజకవర్గ పరిధిలో యలమంచిలి మండలంలో చాలా గ్రామాలు ఉండేవి. అప్పట్లో కొప్పర్రు, మల్లవరం, మల్లవరం లంకతో పాటు భీమవరం మండలంలోని వెంప, శ్రీరాంపురం కూడా ఈ నియోజకవర్గ పరిధిలోనే ఉండేవి. ప్రస్తుతం ఈ నియోజకవర్గంలో నరసాపురం పట్టణం, మండలం, మొగల్తూరు మండలాలు మాత్రమే ఉన్నాయి. జిల్లాలోనే కాకుండా రాష్ట్రంలోనే అతి చిన్న నియోజకవర్గం ఇదే. ప్రస్తుతం 1,68,187 మంది ఓటర్లు ఉన్నారు.

- నరసాపురం

ఫ్లాష్ బ్యాక్



మంత్రుల ఖిల్లా

నియోజకవర్గం : నరసాపురం

మండలాలు : నరసాపురం, మొగల్తూరు, నరసాపురం రూరల్
మొత్తం ఓటర్లు : 1,68,187
పురుషులు : 83,745,
మహిళలు : 84,422

రాష్ట్రంలోనే ప్రత్యేకత
1983 నుంచి టీడీపీకి కంచుకోట
జిల్లాలో అతి చిన్న నియోజకవర్గం

ఉమ్మడి పశ్చిమలో ఈ నియోజకవర్గం ఒకప్పుడు కమ్యూనిస్టుల ప్రాభల్యం ఎక్కువుగా ఉండేది . టీడీపీ ఆవిర్భావానికి ముందువరకు ఇక్కడ ప్రధాన ప్రతిపక్షం కమ్యూనిస్టులే. 1952లో సీపీఎం బలపర్చిన శ్యాంసుందరం, 1967లో ఆర్ఎస్ రాజు ఎమ్మెల్యేలుగా గెలుపొందారు.



1983లో టీడీపీ ఆవిర్భావం తరువాత ఈ నియోజకవర్గం ఆ పార్టీకి కంచుకోటగా ఉంటూ వచ్చింది. 2009 వరకు అంటే 26 ఏళ్లు ఆ పార్టీకి అపజయం లేదు. రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీకి వ్యతిరేక పవనాలు వీస్తున్నప్పటికీ ఇక్కడ మాత్రం ఆ ప్రభావం కనిపించలేదు. ఈ నియోజకవర్గంలో తొలిసారి టీడీపీ ఎమ్మెల్యేగా గెలుపొందిన ఘనత హరిరామజోగయ్యకే దక్కింది. 1983లో గెలిచి ఆయన ఎన్టీఆర్ మంత్రి వర్గంలో హోంమంత్రిగా పనిచేశారు. 1986లో కూడా పోటీ చేసి విజయం సాధించి రెండోసారి మంత్రి అయ్యారు. ఇక ఆ తరువాత 1989 నుంచి 2009 వరకు మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు నాలుగు సార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. చంద్రబాబు, ఎన్టీఆర్ కేబినెట్‌లో గృహనిర్మాణ, విద్యుత్‌శాఖ మంత్రులుగా పని చేశారు. 2009లో ఆయన ప్రజారాజ్యం కండువా కప్పుకోవడంతో తొలిసారి ఈ నియోజకవర్గం టీడీపీ ఓటమి చెందింది.తరువాత ఆయన కాంగ్రెస్‌లో చేరి 2012 ఉప ఎన్నికల్లో ముదునూరిపై విజయం సాధించారు. తిరిగి 2014లో కాంగ్రెస్‌కి రాజీ నామా చేసి వైసీపీ కండువా కప్పుకున్నారు. ఆ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి బండారు మాధవనాయుడు 21,712 ఓట్లతో విజయం సాధించగా కొత్తపల్లి ఓడిపోయారు. అయితే కొత్తపల్లి ఎక్కువ కాలం వైసీపీలో ఇమడలేదు. 2015లో రాజీనామా చేసి టీడీపీలో చేరారు. ఆయనకు 2019 ఎన్నికల్లో టిక్కెట్ ఇవ్వలేదు. దీంతో మళ్లీ వైసీపీ కండువా కప్పుకున్నారు. అయితే అక్కడా టిక్కెట్ లభించలేదు. ఆ ఎన్నికల్లో ముదునూరి విజయానికి కృషి చేశారు. త్రిముఖ పోటీల్లో ముదునూరి జనసేన అభ్యర్థి నాయకర్‌పై 6,400 ఓట్లతో విజయం సాధించారు.

కాంగ్రెస్ ఏడుసార్లు గెలుపు

ఇక్కడ కాంగ్రెస్‌ను కూడా ప్రజలు ఆదరించారు. ఈ నియోజకవర్గంలో ఆ పార్టీ అభ్యర్థులు ఏడుసార్లు విజయం సాధించారు. 1956లో ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థిగా రెడ్డి వెంకటరెడ్డినాయడు గెలుపొంది ఉమ్మడి మద్రాసులో న్యాయ శాఖ మంత్రిగా పనిచేశారు. నియోజకవర్గ చరిత్రలో తొలి మంత్రి చేసిన ఘనత ఈయనకే దక్కింది. ఆ తరువాత పరకాల శేషావతారం రెండు సార్లు మంత్రి అయ్యారు. 1960, 1962, 1972, 1976 ఎన్నికల్లో పరకాల శేషావతారం విజయం సాధించారు. పీవీ నర్సింహారావు, కోట్ల విజయభాస్కర్‌రెడ్డి కేబినెట్‌లో ఆయన మునిసిపల్, రవాణశాఖ మంత్రిగా పనిచేశారు. 1981లో ఆయన ఆకాల మరణంతో ఆయన సతీమణి పరకాల కాళికాంబ ఉప ఎన్నికల్లో పోటీ చేసి అతి తక్కువ 873 ఓట్లతో విజయం సాధించారు. తొలి మహిళా ఎమ్మెల్యే కూడా కాళికాంబే.

మూడు సార్లు ఉప ఎన్నికలు

నరసాపురం నియోజకవర్గ చరిత్రలో ఇప్పటివరకు మూడు సార్లు ఉప ఎన్నికలు జరిగాయి. 1955లో నియోజకవర్గం ఏర్పడిన తరువాత తొలి ఉప ఎన్నిక 1982లో జరిగింది. అప్పటి వరకు మంత్రిగా ఉన్న పరకాల శేషావతారం ఆకస్మికంగా మృతి చెందారు. దీంతో జరిగిన ఉప ఎన్నికలో ఆయన సతీమణి కాళికాంబ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. జనతాదల్ అభ్యర్థి నాగేశ్వరరావు మీద 800 ఓట్లతో గెలిచారు. ఆ తరువాత ఉప ఎన్నిక 1996లో జరిగింది అప్పటి వరకు మంత్రిగా ఉన్న కొత్తపల్లి సుబ్బారాయుడు పదవికి రాజీనామా చేసి ఎంపీ అభ్యర్థిగా బరిలో నిలిచారు. దీంతో ఆయన సోదరుడు జానకీరామ్ టీడీపీ అభ్యర్థిగా పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి పరకాల ప్రభాకర్‌పై జానకీరామ్ 5500 ఓట్లతో విజయం సాధించారు. మూడోసారి ఎన్నిక 2012లో వచ్చింది. 2009లో కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన ముదునూరి ప్రసాద రాజు వైసీపీలో చేరి జగన్‌కు మద్దతుగా నిలవడంతో విప్ ధిక్కరించారనే కారణంతో పార్టీ అనర్హత వేటు వేసింది. దీంతో జరిగిన ఉప ఎన్నికల్లో ఆయన వైసీపీ తరఫున బరిలో నిలిచారు. కాంగ్రెస్ అభ్యర్థిగా కొత్తపల్లి సుబ్బారాయుడు సుమారు 3200 ఓట్లతో విజయం సాధించారు.

సంవత్సరం	గెలిచిన అభ్యర్థి	పార్టీ	ప్రత్యర్థి	పార్టీ	మెజార్టీ
1952	పి.శ్యాంసుందర్	సీపీఐ	వెంకన్న	కెఎంపీపీ	61,241
1955	జి.వెంకటరెడ్డినాయుడు	కాంగ్రెస్	ఎస్.రామారావు	సీపీఎం	8,535
1962	పరకాల శేషావతారం	కాంగ్రెస్	ఆర్ఎస్ రాజు	సీపీఐ	3,794
1967	బీఆర్ఎస్ రాజు	సీపీఎం	శేషావతారం	కాంగ్రెస్	4,305
1972	పరకాల శేషావతారం	కాంగ్రెస్	ఆర్ఎస్ రాజు	సీపీఎం	18,700
1978	పరకాల శేషావతరం	కాంగ్రెస్	పి.వాసుదేవరావు	జనత	11,834
1983	హరిరామజోగయ్య	టీడీపీ	కాళికాంబ	కాంగ్రెస్	23,653
1986	హరిరామజోగయ్య	టీడీపీ	ఎం.సూర్యనారాయణ	కాంగ్రెస్	33,047
1989	కొత్తపల్లి సుబ్బారాయుడు	టీడీపీ	పి.వాసుదేవరావు	కాంగ్రెస్	13,201
1994	కొత్తపల్లి సుబ్బారాయుడు	టీడీపీ	పరకాల ప్రభాకర్	కాంగ్రెస్	15,477
1999	కొత్తపల్లి సుబ్బారాయుడు	టీడీపీ	తులసీ	కాంగ్రెస్	34,729
2004	కొత్తపల్లి సుబ్బారాయుడు	టీడీపీ	ముదునూరి	కాంగ్రెస్	3,518
2009	ముదునూరి ప్రసాదరాజు	కాంగ్రెస్	కొత్తపల్లి సుబ్బారాయుడు	ప్రజారాజ్యం	17,325
2014	బండారు మాధవనాయుడు	టీడీపీ	కొత్తపల్లి సుబ్బారాయుడు	వైసీపీ	21,712
2019	ముదునూరి ప్రసాదరాజు	వైసీపీ	బొమ్మిడి నాయకర్	జనసేన	6,436

తొలి మంత్రి గ్రంధి వెంకటరెడ్డి నాయుడు

ఉమ్మడి పశ్చిమ గోదావరిలో నరసాపురం నియోజకవర్గానికి రాజకీయంగా ఒక ప్రత్యేక గుర్తింపు ఉంది. మరే నియోజకవర్గంలో లేని విధంగా ఇక్కడ గెలుపొందిన అభ్యర్థులు కేబినేట్ పదవుల్ని దక్కించుకున్నారు. వారిలో తొలి మంత్రి అయిన ఘనత గ్రంధి వెంకటరెడ్డినాయుడుకే దక్కింది. ఉమ్మడి మద్రాసులో ఉన్నప్పుడు 1955 జరిగిన ఎన్నికల్లో ఆయన కాంగ్రెస్ అభ్యర్థిగా గెలిచి న్యాయశాఖ మంత్రిగా పని చేశారు. ఆ తరువాత 67లో, 78లో గెలిపొందిన పరకాల శేషావతారం ఉమ్మడి రాష్ట్రంలో పురపాలక, దేవదాయశాఖ మంత్రిగా పని చేశారు. టీడీపీ ఆవిర్భావం తరువాత ఈ నియోజకవర్గం నుంచి 1983లో గెలుపొందిన హరిరామజోగయ్య ఎన్టీఆర్ కేబినేట్‌లో హోంశాఖ నిర్వహించారు. ఆ తరువాత అదృష్టం కొత్తపల్లిని వరించింది. 1994లో గెలుపొందిన కొత్తపల్లి ఎన్టీఆర్ కేబినేట్ గృహ నిర్మాణ మంత్రిగా, ఆ తరువాత 1999ఎన్నికలో గెలిచి చంద్రబాబు కేబినేట్‌లో విద్యుత్ మంత్రిగా పని చేశారు.

నాటి నృసింహపురమే.. నేటి నరసాపురం

వశిష్ఠ గోదావరి తీరంలో సాగర సంగమ స్థలానికి సమీపంలో అవతరించిన నరసాపురం జిల్లాలో చారిత్రక ప్రాముఖ్యత కలిగిన ప్రదేశాల్లో ఒక్కటి. త్రేతాయుగంలో శ్రీరామచంద్రుడు సీతాదేవి, లక్ష్మణుడితో వశిష్ఠ గోదావరి తీరంలో సంచరించినట్లు పురాణాలు చెపుతున్నాయి. నృసింహపురాణం ఆధారంగా నరసాపురాన్ని గతంలో నృసింహపురం, నవరసపురం వంటి పేర్లతో వ్యవహరించినట్లు తెలుస్తోంది. అంతర్వేది నరసింహస్వామి దేవాలయం నరసాపురానికి సమీపంలో ఉంది. ఆ స్వామి పేరును బట్టి నరసింహపురంగా ఏర్పడి కాలక్రమంలో నరసాపురంగా మారిందని ఒక కథనం ఉంది. ముస్లిం గ్రంథాలు బట్టి నరసాపురం నేషాపురంగా ఉండేదని కాలక్రమంలో నరసాపురంగా మారిందని మరో కథనం ఉంది. ప్రముఖ మదన గోపాలస్వామి దేవాలయం ప్రాచీనతను బట్టి క్రీస్తు శకం 1173 నాటికే నరసాపురం ఒక స్థిరరూపం దాల్చిందని తెలియవచ్చింది.


మంత్రి కారుమూరి వల్లే రాజీనామా : చిట్టూరి సునంద



ఇరగవరం, ఏప్రిల్ 18 : వైసీపీపై ప్రజల్లోనే కాకుండా ఆ పార్టీ నాయకుల్లోనూ అసంతృప్తి పెరుగుతోంది. తణుకు మండలం వేల్పూరు గ్రామానికి చెందిన మాజీ ఏఎంసీ చైర్మన్, వైసీపీ సీనియర్ నాయకురాలు చిట్టూరి సునంద ఆ పార్టీకి రాజీనామా చేయాలని నిర్ణయించుకున్నారు. గురువారం ఆమె గృహంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మంత్రి కారుమూరి వైఖరి కారణంగానే పార్టీకి రాజీనామా చేస్తున్నానని వెల్లడించారు. కూటమి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణకు తన మద్దతు ఇస్తున్నానని స్పష్టం చేశారు. పార్టీ గెలుపు కోసం అహర్నిశలు శ్రమించిన తనపై లేనిపోని ఆరోపణలు చేసి అధికార పార్టీ కార్యక్రమాలకు మంత్రి తనని దూరం చేశారన్నారు. గత నాలుగు సంవత్సరాలుగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నానని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఐదేళ్లలో అభివృద్ధి లేకపోగా అవినీతి పెరిగిందన్నారు. టిడిఆర్ స్కాం, ఇళ్ళ స్థలాల్లో పేదల వద్ద డబ్బులు దోచుకోవడం వంటి దుర్మార్గమైన పనులు కారుమూరి చేశారని విమర్శించారు. నా వెనుక ఉన్న కార్యకర్తలను కూడా అనేక ఇబ్బందులను గురి చేశారని వారికి వచ్చిన ఇళ్ళ సైతం లాగేసుకుకున్నారని విమర్శించారు. ఇటు వంటి దుర్మార్గ పాలన వల్లే తణుకు నియోజకవర్గంలో అనేక మంది వైసీపీ నాయకులు కారుమూరికి దూరంగా ఉన్నారన్నారు.

పశ్చిమలో పవన్ కల్యాణ్ పర్యటన

21,22 తేదీల్లో షెడ్యూల్ ఖరారు



భీమవరం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో పర్యటించనున్నారు. ఈ నెల 21, 22 తేదీల్లో నిర్వహించే ఎన్నికల సభల్లో పాల్గొంటారు. 21 వతేదీన భీమవరం, నరసాపురంలో, 22న తాడేపల్లిగూడెం, ఉంగుటూరు సభల్లో పాల్గొంటారు. పోలవరం నియోజక వర్గంలో 30వ తేదీన పర్యటిస్తారని పార్టీ వర్గాలు చెపుతున్నాయి. చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు ఉమ్మడిగా హాజరవుతారా లేదా జనసేనాని ఒక్కరే పాల్గొంటారా అనేది త్వరలో నిర్ణయం కానుంది. ఉమ్మడి పశ్చిమలో 21, 22 తేదీల్లో పవన్ కల్యాణ్ పర్యటన కోసం ఆ పార్టీ నాయకులు కసరత్తు చేస్తున్నారు.



విస్తృతంగా తనిఖీలు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 18 : ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ మేరీ ప్రశాంతి అన్నారు.బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం తెల్లజాము వరకూ జిల్లాలోని అన్ని ప్రధాన రహదారులపై తనిఖీలు నిర్వహించారు. గడిచిన 24 గంటల్లో జిల్లా వ్యాప్తంగా చేపట్టిన తనిఖీల్లో రూ4,340 విలువైన 145.6 లీటర్ల మద్యం, ఆరు లక్షల 52 వేలు రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.



లక్ష్మణేశ్వరంలో సగం వైసీపీ ఖాళీ

సుమారు 500 మంది జనసేనలో చేరిక

నరసాపురం రూరల్, ఏప్రిల్ 18: నరసాపురం మండలంలో వైసీపీకి ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీకి కంచుకోటగా ఉంటూ వస్తున్న లక్ష్మణేశ్వరంలో గురువారం సుమారు 500 మంది వైసీపీకి రాజీనామాలు చేశారు. గ్రామానికి చెందిన మల్లిపూడి చిన్నబాబు, వెన్నా మురళీ ఆధ్వర్యంలో వీరింతా జనసేనలో చేరారు. వీరికి మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, బొమ్మిడి నాయకర్, చాగంటి మురళీకృష్ణలు పార్టీ కండువాలు కప్పి జనసేనలోకి ఆహ్వానించారు. పోత్తూరి రామరాజు, వర్ధనపు ప్రసాద్‌లు మాట్లాడుతూ శత్రువును ఐక్యంగా తరిమికొడదామని పిలుపునిచ్చారు. రానున్న రోజుల్లో మరి కొంత మంది కూటమిలో చేరేందుకు రెడీగా ఉన్నారన్నారు. కొప్పాడ రవి, ఆకన చంద్రశేఖర్, తోట శ్రీదర్, వలవల నాని, బందెల రవీంద్ర, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.



ఆచంటలో వారంతా గుడ్‌బై

పెనుమంత్ర, ఏప్రిల్ 18 : పెనుమంత్ర మండలం మార్టేరులో ఒక సామాజిక వర్గానికి చెందిన రైతులు కొందరు వైసీపీకి గుడ్‌బై చెప్పి మాజీ మంత్రి పితాని సత్యనారాయణ సమక్షంలో టీడీపీలో చేరారు. పితాని మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి కొత్తగా ప్రవేశ పెట్టిన భూ సంరక్షణ చట్టం రైతులకు నష్టపరిచేదిగా ఉందని దీంతో రైతులు ప్రభుత్వంపై వ్యతిరేకంగా ఉన్నారన్నారు. వెలగల నాగిరెడ్డి, గుడి మెట్ల వెంకటేశ్వరరెడ్డి, పడాల తిరపారెడ్డి, చిర్ల సురేంద్రరెడ్డి, చిర్ల యేసు, చిర్ల వెంకటరెడ్డి, మల్లిడి రామ కృష్ణారెడ్డి, వెలగల నాగిరెడ్డి, సత్తి సూర్యచంద్రారెడ్డి, గుడిమెట్ల తిరపా రెడ్డి, చింత దుర్గాప్రసాద్ రెడ్డి, కొవ్వూరి బుల్లి రెడ్డి, గుడిమెట్ల సాయి రెడ్డి, బేతిరెడ్డి లీలా కృష్ణారెడ్డి, గుడిమెట్ల సాయి రెడ్డి, చింత హరీష్ కుమార్ రెడ్డి, చిర్ల సూర్యనారాయణ రెడ్డి, కర్రీ నాగ చంద్రశేఖర్ రెడ్డి, గొలుగూరి చంటి రెడ్డి, సూర్రెడ్డి, కోనాల ఆనందీశ్వర్ రెడ్డి, పడాల బుల్లియ్యా, కర్రీ రంజిత్ కుమార్ రెడ్డి తదితరులు తెలుగుదేశం పార్టీలో చేరారు.. పండించిన పంట కూడా అమ్ముకోలేని పరిస్థితి ఉందని, రైతు వ్యతిరేక విధానాల కారణంగా టీడీపీలో చేరినట్టు తెలిపారు.

కూటమితోనే నవ్యాంధ్ర పునఃనిర్మాణం

» ఏలూరు టీడీపీ కూటమి అభ్యర్థి బడేటి రాధాకృష్ణయ్య



ఏలూరులో మినీ మేనిఫెస్టో వివరిస్తున్న చంటి

ఏలూరుటూటౌన్, ఏప్రిల్ 18 :నవ్యాంధ్ర పునఃనిర్మాణం, రాష్ట్ర ప్రజల భవిష్యత్తు కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని ఏలూరు టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి బడేటి రాధాకృష్ణయ్య (చంటి) అన్నారు. గురువారం ప్రజాసంకల్ప యాత్ర 22వ డివిజన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధేనని, గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. మంచి జరిగితే ఓటేయాలని జగన్ అడుగుతున్నారన్నారు. అసలు మంచి ఎక్కడ జరిగిందని ప్రశ్నించారు. మళ్లీ ప్రజలను జగన్ మోసం చేయాలని మాటలతో మాయ చేస్తున్నాడన్నారు. ఈసారి మోసపోయేందుకు ప్రజలు సిద్ధంగా లేరని, రానున్న ఎన్నికల్లో కూటమికి సంపూర్ణ ప్రజామద్దతు ఉందన్నారు. పాదయాత్రలో ఆయన ప్రజాసమస్యలు అడిగి తెలుసుకున్నారు. సూపర్ సిక్స్ కరపత్రాలను అందించి అవగాహన కల్పించారు. ప్రజలు వివరించే సమస్యలను కూటమి ప్రభుత్వం రాగానే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో శివప్రసాద్, కాశీనరేష్, నిర్మలకుమారి, రామకృష్ణ, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు. సాయంత్రం 29వ డివిజన్ లంకపేటలో సంకల్పయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి రెడ్డి అప్పలనాయుడు, మధ్యాహ్నపు ఈశ్వరి బలరామ్ దంపతులు, శివ, గాది రాంబాబు పాల్గొన్నారు.





జంగారెడ్డిగూడెంలో ప్రజలకు నమస్కరిస్తున్న రోషన్‌కుమార్, మహిళల హారతి

ప్రజా సమస్యలన్నీ పరిష్కరిస్తాం

» చింతలపూడి టీడీపీ కూటమి అభ్యర్థి సొంగా రోషన్

చింతలపూడి, ఏప్రిల్ 18 : 'కూటమి అధికారంలోకి రాగానే ప్రజా సమస్యలన్నీ పరిష్కరిస్తాం. ప్రచారంలో భాగంగా ఎంతోమంది పలు సమస్యలు తెలుపుతు న్నారు. అవన్నీ పరిష్కరించేవే. కానీ ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం కన్పిస్తోంది. స్థానిక సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరించే బాధ్యత నాది. ఇది నా హామీ' అని చింతలపూడి నియోజకవర్గ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి సొంగా రోషన్‌కు మార్ అన్నారు. గురువారం సూపర్ సిక్స్ శంఖారావం పథకాలను జంగారెడ్డిగూ డెం పట్టణంలోని 9,10,11వ వార్డుల్లో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం పట్టణంలో వైసీపీపై తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. రాష్ట్ర అభివృద్ధి, భవిష్యత్తు తరాలకు, యువత భవిష్యత్తుకు లక్షల ఉద్యోగాలు రావాలన్నా, రోడ్లు అభివృద్ధి చెందాలన్నా, ఆగిన కార్పొరేషన్ రుణాలు మళ్లీ తిరిగి రావాలన్నా చంద్రబాబు, పవన్, మోదీతోనే సాధ్యమన్నారు. టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్రశేషు, మండవ లక్ష్మణరావు, చిట్టిబోయిన రామలింగేశ్వరరావు, పెనుమర్తి రామ్‌కుమార్, రాజాన సత్యన్నారాయణ, కరుటూరి రమాదేవి, తెలగారపు జ్యోతి, కొంచాడ ఉమాప్రసాద్, నంబూరి రామచంద్రరాజు, గుమ్మడి చిన్నప్రసాద్, కరణం రాంబాబు, జనసేన నాయకులు ఉక్కుర్తి సీతారాం, వలవల తాతాజీ పాల్గొన్నారు.

కూటమి విజయంతోనే పల్లెల అభివృద్ధి

» ఉంగుటూరు జనసేన కూటమి అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు



పిప్పరలో ఓట్లు అభ్యర్థిస్తున్న జనసేన కూటమి అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు

గణపవరం, ఏప్రిల్ 18 : రాష్ట్రంలో కూటమి విజయంతోనే పల్లెల అభివృద్ధి సాధ్యమని ఉంగుటూరు జనసేన కూటమి అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు అన్నారు. గురువారం పిప్పర గ్రామంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో కలిసి ఇంటింటా తిరిగి ఓటర్లను అభ్యర్థించారు. వైసీపీ పాలనలో అన్ని వ్యవస్థలు నిర్వీర్యం అయ్యాయని ఆరోపించారు. ప్రస్తుతం అరాచక పాలన నడుస్తుందని సంక్షేమ పాలన కావాలంటే జనసేన కూటమి గ్లాసు గుర్తుకు ఓటు వేయాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో అభివృద్ధి, మౌలిక సదుపాయాలు పూర్తిగా కుంటుపడి పోతున్నాయని గ్రామాల అభివృద్ధికి వైసీపీ ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వలేదన్నారు. కూటమి విజయంతోనే గ్రామాలను మరింత అభివృద్ధి చేస్తామన్నారు. రైతులకు, యువతకు, కూలీలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, సంక్షేమ పథకాలు ఇంటికి అందజేస్తామన్నారు. ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్‌కు సైకిల్ గుర్తుపై, తనకు గ్లాస్‌గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. టీడీపీ నాయకులు ఇందుకూరి రామకృష్ణంరాజు, అద్దేపల్లి వాసురాజు, కూసంపూడి సురేంద్రకుమార రాజు, యాళ్ల సుబ్బారావు, కాపారం చిన్న, కానుమిల్లి చంటి, ఇంటూరి చంద్రమోహనరావు, జనసేన నాయకులు తోట శ్రీనివాసరావు పాల్గొన్నారు.

యువతను చైతన్యపరిచేందుకే చైతన్య యాత్ర



చింతలపూడి చేరుకున్న నెల్లూరు వాసి నితిన్

చింతలపూడి, ఏప్రిల్ 18 : సమాజంలో యువతను సేవా కార్యక్రమాల్లోనూ, వ్యాపార రంగంలోనూ చైతన్య పరిచేందుకే సైకిల్‌యాత్ర ప్రారంభించినట్టు నెల్లూరు జిల్లా కావలి పట్టణానికి చెందిన చింతలపూడి నితిన్ అనే యువకుడు బీటెక్ పూర్తిచేసి యాత్రను చేపట్టినట్టు తెలిపారు. ఫిబ్రవరి 27వ తేదీన కావలిలో చేపట్టిన సైకిల్ యాత్ర నెల్లూరు, గుంటూరు, కృష్ణాజిల్లాలో పూర్తిచేసుకుని 18వ తేదీన చింతలపూడికి చేరుకున్నారు. సైకిల్‌పై 'మనకు మనమే ఉద్ధరించుకోవాలి, మన మనసే మన మిత్రుడు లేదా శత్రువు' అనే నినాదంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్టు తెలిపారు. ఈ యాత్ర శ్రీకాకుళం వరకు కొనసాగించి తిరిగి వేరే మార్గంలో కావలి పట్టణానికి చేరుకుంటానన్నారు.

క్రైం వార్తలు

రెండు కార్లు ఢీ : ఒకరి మృతి.. మరొకరికి గాయాలు



కార్లు ఢీకొన్న ప్రమాద దృశ్యం

ఏలూరు క్రైం, ఏప్రిల్ 18 : చైల్డ్‌వెల్ఫేర్‌లో మేనేజర్‌గా ఉద్యోగం చేసి రిటైరై ప్రస్తుతం న్యాయవాదిగా కొనసాగుతున్న వ్యక్తి కారునడుపుతుండగా మరో కారు వచ్చి ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. భీమవరంలోని గునుపూడికి చెందిన యాళ్ల హనక్‌వర్ధన్(61) గతంలో చైల్డ్‌వెల్ఫేర్‌లో మేనేజర్‌గా చేసి రిటైర్ అయ్యారు. ప్రస్తుతం న్యాయవాదిగా ప్రాక్టీసు చేస్తున్నారు. తన కారులో గురువారం ఉదయం భీమవరం నుంచి విజయవాడ వెళ్తున్నారు. మార్గమధ్యలో ఏలూరు రూరల్ మండలం కలకుర్రు గ్రామం వద్ద ఎదురుగా కారు అతివేగంగా వచ్చి హనక్‌వర్ధన్ కారును ఢీ కొంది. హనక్‌వర్ధన్ అక్కడికక్కడే మృతి చెందారు. ఢీ కొన్న కారులోని వ్యక్తి గాయాలపాలవ్వడంతో ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్లారు. ఈ సమాచారం అందుకున్న రూరల్ ఎస్‌ఐ కె.రాజారెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

కోడి పందేలపై దాడి.. ఇద్దరి అరెస్ట్

జీలుగుమిల్లి, ఏప్రిల్ 18 :జీలుగుమిల్లి శివారు చిర్రివారిగూడెంలో కోడి పందేలపై దాడి చేశామని ఎస్‌ఐ వి.చంద్రశేఖర్ తెలిపారు. గురువారం అందిన సమాచారంతో సిబ్బందితో కలిసి దాడి చేసి ఇద్దరు వ్యక్తుల్ని అదుపులోకి తీసుకుని, రూ.3,880 నగదు, బైక్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

మూగ జీవాలను సంరక్షించాలి

» డీపీవో శ్రీనివాస్‌విశ్వనాథ్



తాగునీటి తొట్టెను పరిశీలిస్తున్న డీపీవో శ్రీనివాస్ విశ్వనాథ్

పెదవేగి, ఏప్రిల్ 18 : వేసవిలో మూగజీవాల సంరక్షణ పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస్‌విశ్వనాథ్ సూచించారు. గురువారం దుగ్గిరాల సచివాలయాన్ని సందర్శించిన ఆయన గ్రామంలో పశువులు తాగునీటి తొట్టెలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనుషులతోపాటు పశువుల తాగునీటి అవసరాలను తీర్చాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. గ్రామాల్లో నిర్మించిన పశువుల తాగునీటి తొట్టెలను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు నిత్యం నీటితో నిండుగా ఉండేలా బాధ్యతగా ఉండాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. వేసవి ప్రణాళి కలో భాగంగా తాగునీటి తొట్టెల్లో చెత్తాచెదారం లేకుండా పరిశుభ్రం చేసి, సురక్షితమైన తాగునీటిని అందించాలన్నారు. పంచాయతీ కార్యదర్శి సాయికృష్ణ, డీపీఎం పులి సత్యనారాయణ పాల్గొన్నారు.

వేసవి ఎండల నుంచి జాగ్రత్తగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న సహాయ మలేరియా అధికారి గోవిందరావు

పెదవేగి, ఏప్రిల్ 18 : వేసవి ఎండలనుంచి అత్యంత జాగ్రత్తగా ఉండాలని సహాయ మలేరియా అధికారి గోవిందరావు సూచించారు. గురువారం పెదవేగి పీహెచ్‌సీలో వైద్యసిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వేసవిలో సంభవించే వడదెబ్బ, ఇతర అనారోగ్య సమస్యలపై వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ వైద్యసిబ్బంది గ్రామాల్లో ఇంటింటికి తిరిగి వడదెబ్బకు గురయ్యే అవకాశాలు, లక్షణాలు, వడదెబ్బ తగిలితే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. అధిక వేడిమితో శరీరంలో నీరంతా చెమట రూపంలో పోతుం దన్నారు. దీంతో నిస్సత్తువ ఆవరిస్తుందని, నిర్లక్ష్యం చేస్తే మరింత ప్రమాదకరంగా మారుతుందన్నారు. ఉదయం పదకొండు గంటలనుంచి సాయంత్రం నాలుగు గంటల మధ్య సాధ్యమైనంతవరకు బయట తిరగకుండా ఉండడం మేలని సూచించారు. బయటకు వెళ్లాల్సి వస్తే తలకు టోపీ, ముఖానికి మాస్క్ ధరించి వెళ్లాలని చెప్పారు. వైరల్ జ్వరాలు ప్రధానంగా డెంగీ సోకే ప్రమాదం ఉందని, దీన్ని దృష్టిలో పెట్టుకుని, ఇంటి ఆవరణతోపాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. సమావేశంలో పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ పి.పూర్ణిమ, డాక్టర్ ప్రత్యూష, సీహెచ్‌వో డి.రోజ్‌మేరీ, మంగమ్మ, రమేష్, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

వైసీపీ పాలనకు చరమగీతం పలుకుదాం

పెదవేగి, ఏప్రిల్ 18 : అరాచక వైసీపీ ప్రభుత్వ పాలనకు చరమగీతం పలుకుదామని టీడీపీ నాయకుడు పెదర్ల రాంబాబు అన్నారు. గురువారం ఎన్డీయే కూటమి అభ్యర్థుల గెలుపును కోరుతూ విజయరాయిలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను పంచుతూ పథకాలతో కలిగే లబ్ధిని ప్రజలకు వివరించారు.

కూటమి అభ్యర్థులను గెలిపించాలి

ఉంగుటూరు, ఏప్రిల్ 18 : రానున్న ఎన్నికలలో కూటమి అభ్యర్థులను గెలిపించాలని అసెంబ్లీకి గాజు గ్లాసు, పార్లమెంటుకు సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని జనసేన ఉంగుటూరు అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు సోదరుడు భీమరాజు అభ్యర్థించారు. నీలాద్రిపురంలో రెండో రోజు గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉంగుటూరులో సర్పంచ్ బండారు సింధుమధు, ఉప సర్పంచి పాతూరి జగదీష్ కార్యకర్తలు పాల్గొన్నారు.

జనసేనలో చేరిన వైసీపీ నాయకులు

గణపవరం, ఏప్రిల్ 18:జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ సమక్షంలో గణపవరం మండల వైసీపీ నాయకులు జనసేన తీర్థం పుచ్చుకున్నారు. గురువారం మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో గణపవరం వైసీపీ నేతలు జనసేనలో చేరినట్టు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కాపునాడు మండల అధ్యక్షుడు, సొసైటీ మాజీ అధ్యక్షుడు గంటా అన్నవరం, గణపవరం మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కూసంపూడి జగపతిరాజు, బీసీ సెల్ అధ్యక్షుడు బుద్ధారపు పుల్లయ్య, సూర్యచంద్రరావు, తదితరులు చేరారు.



పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న సొంగా రోషన్‌కుమార్

'రోషన్‌తో నేను' పోస్టర్ ఆవిష్కరణ

చింతలపూడి, ఏప్రిల్ 18 :చింతలపూడి నియోజకవర్గ టీఎన్‌ఎస్‌ఎఫ్ అధ్యక్షుడు తాటిసింహా ఆధ్వర్యంలో చేపట్టబోతున్న 'బెటర్ చింతలపూడి కోసం రోషన్‌తో నేను' అనే పోస్టర్‌ను చింతలపూడి టీడీపీ కూటమి అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్ ఆయన స్వగృహంలో గురువారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాన్ని తాటిసింహా వివరిస్తూ నా మొదటి ఓటు చింతలపూడి అభివృద్ధికే అనే కాన్సెప్ట్‌తో కొత్తగా నమోదైన ఓటర్లను కలిసి సొంగా రోషన్‌కుమార్‌కు ఓటు వేయడం ద్వారా చింతలపూడి అభివృద్ధి జరుగుతుందని, కొత్త ఓటర్లను కలిసి అభ్యర్థించడమే ఉద్దేశమన్నారు. పోస్టర్ ఆవిష్కరణలో టీడీపీ నాయకులు జె.ముత్తారెడ్డి, అట్లూరి శ్రీనివాసరావు, కొండ్రు దేవా, తాటిసింహా, పల్లె మున్న, జనసేన నాయకులు చీదరాల మధుబాబు పాల్గొన్నారు.



సేవా పురస్కారాలను అందించిన ఎంపీపీ శ్రీలక్ష్మి

ఘనంగా సర్వోదయ ఆవిర్భావ దినోత్సవం

» ఆరుగురు స్వాతంత్ర్య సమరయోధులకు సన్మానం

ఉంగుటూరు, ఏప్రిల్ 18:చరిత్రలో సర్వోదయ ఆవిర్భావం ఒక అపురూపం అని పలువురు వక్తలు పేర్కొన్నారు. గురువారం నాచుగుంటలోని సర్వోదయ నగర్‌లో ఆ సంస్థ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి చింతలపాటి వరప్రసాద మూర్తిరాజు సేవలను కొనియాడారు. విశిష్ట సేవలందించిన ఆరుగురు స్వాతంత్ర్య సమరయోధులైన పంచకర్ల సత్యనారాయణ(పూళ్ల), చర్ల మృదులకుమారి, సాగిరాజు జానకీరామరాజు, కొండ్రెడ్డి సర్వేశ్వరరావు, గట్టిం మాణిక్యాలరావు, యర్రా రాధాకృష్ణలను సత్కరించి పురస్కారాలు అందించారు. అనంతరం వీరంతా కలిసి సర్వోదయ స్థూపం వద్ద ప్రతిజ్ఞ చేశారు. సర్వోదయ నాయకులు వేగేశ్న సూర్యనారాయణరాజు, ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, తల్లాప్రగడ భీమేశ్వరరావు, ఇందుకూరి ప్రసాదరాజు, దొంతంశెట్టి సత్యనారాయణ, రామిరెడ్డి వెంకటరెడ్డి, పరిమి రాఘవులు, జల్లా వీరభద్రరావు, ఇమ్మణ్ణి గంగాధరరావు, నాచుగుంట సర్పంచి భర్త యేలేటి సురేష్, సర్వోదయ నాయకులు పాల్గొన్నారు.

సరిహద్దు చెక్‌పోస్టులో వాహనాల తనిఖీ



తాటియాకులగూడెంలో చెక్‌పోస్టును పరిశీలించిన మిశ్రమ్ గౌరవ్‌మధుకర్

జీలుగుమిల్లి, ఏప్రిల్ 18:తాటియాకులగూడెం రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టును జిల్లా ఎన్నికల అధికారి మిశ్రమ్ గౌరవ్‌మధుకర్ గురువారం సాయంత్రం పరిశీలించారు. ఈ క్రమంలో వాహనాల తనిఖీ, వాహనాల రాకపోకల నమోదు, సిబ్బంది పనితీరు వంటి అంశాలపై ఈఆర్వో పీఆర్డీ నిఖిల్ మధుశరణ్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఎన్నికల నేపథ్యంలో చెక్‌పోస్టు రికార్డును పరిశీలించారు. నిరంతరం వాహనాలు తనిఖీ చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. ఎస్‌ఈబీ ఎస్‌ఐ శేఖర్‌బాబు, హెడ్‌కానిస్టేబుల్ సుధాకర్, రెవన్యూ, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

లింగపాలెంలో వాహన తనిఖీలు

లింగపాలెం, ఏప్రిల్ 18:లింగపాలెం మండలం, లింగపాలెం, ధర్మాజిగూడెం ప్రధాన రహదారిపై హార్టికల్చర్ ఏడీ శాంతి ఆధ్వర్యంలో వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఎన్నికల ప్రక్రియను సజావుగా కొనసాగించేందుకు తోడ్పడాలన్నారు. అక్రమంగా మద్యం కాని, ఓటర్లను ప్రలోభపెట్టేందుకు ఇతర సామగ్రి కాని అధిక మొత్తంలో నగదు తీసుకువెళితే చర్యలు తీసుకుంటామన్నారు. ఆమెతోపాటు కానిస్టేబుల్స్ రాజు, మధు, సిబ్బంది పాల్గొన్నారు.

లింగ వివక్షత నిర్మూలనకు కృషిచేద్దాం

ఏలూరు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 18 :లింగవివక్షతకు తావులేకుండా కుటుంబంలో తల్లిదండ్రులు ఆడ, మగ పిల్లలను సమానంగా పెంచాలని డీఎంహెచ్‌వో కార్యాలయ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పూర్ణచంద్రరావు సూచించారు. గురువారం స్థానిక డీఎంహెచ్‌వో కార్యాలయంలో కుటుంబ నియంత్రణ విభాగం ప్రోగ్రాం ఆఫీసర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేసే స్కానింగ్ సెంటర్లపై చట్టపరమైన చర్యలు చేపడతామని, ఆకస్మిక తనిఖీలను జిల్లావ్యాప్తంగా క్షేత్రస్థాయిలో వైద్యాధికారులు చేస్తున్నారని వివరించారు. లింగ నిష్పత్తి సమానత్వానికి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ భార్గవి, డాక్టర్ సాహిత్య, ఇన్‌చార్జి డెమో నాగరత్నం తదితరులు పాల్గొన్నారు.

విచ్చలవిడి మందుల వాడకంతో కిడ్నీలకు హాని



వైద్యపరీక్షలు చేస్తున్న ఆయుష్ వైద్యబృందం

ఏలూరు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 18:మూత్రపిండాలను ఆరోగ్యవంతంగా ఉంచుకోవడానికి యాభై ఏళ్లు పైబడినవారు కనీసం ఏడాదికోసారైనా వైద్యపరీక్షలు చేయించుకోవాలని ఆయుష్ హాస్పిటల్ నెఫ్రాలజిస్టు డాక్టర్ నల్లమోతు ప్రవీణ్ సూచించారు. గురువారం స్థానిక ఉషాబాల కాంప్లెక్స్‌లో ఉషా గ్రూప్స్ ఛైర్మన్ డాక్టర్ వీవీ బాలకృష్ణారావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. సుమారు 180 మందికి కిడ్నీల పనితీరు, బీపీ, మధుమేహం, ఈసీజీ తదితర పరీక్షలనుచేసి, అవసరమైనవారికి మందులు అందజేశారు. డాక్టర్ ప్రవీణ్ మాట్లాడుతూ వైద్యుల సలహాలు, పర్యవేక్షణలేకుండా విచ్చలవిడిగా మందులు వినియోగించడం వల్ల కిడ్నీసంబంధిత రుగ్మతకు దారితీస్తాయని హెచ్చరించారు. ఆస్పత్రి మేనేజర్ కాశీనాథ్ జాస్తి, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ భానుకిరణ్ పాల్గొన్నారు.

మీటర్ రీడర్లకు వేతనాలు చెల్లించాలి

ఏలూరు రూరల్, ఏప్రిల్ 18:మీటర్ రీడర్లకు ఎస్క్రో వేతనాలు చెల్లించాలని, 10+2గా పనిదినాలను ఇచ్చిన హామీప్రకారం అమలు చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ విద్యుత్‌మీటర్ రీడర్స్ అసోసియేషన్ నాయకులు గురువారం ఆ శాఖ ఎస్ఏవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మల్లేశ్వరరావు, కె.మురళీబాబు మాట్లాడుతూ విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న మీటర్ రీడర్లకు ఇంధన కార్యదర్శి ఫిబ్రవరి నుంచి మినిట్స్ రూపంలో ఎస్క్రో ద్వారా వేతనాలు చెల్లించాలని, పనిదినాలను పెంచాలని అధికారులకు తెలియజేశారన్నారు. మీటర్ రీడర్లకు ఏప్రిల్ నుంచి అమలుచేసేలా ఆదేశాలు ఇచ్చారని, ఆ ఆదేశాలు డిస్కంలో అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం ఎస్క్రో అకౌంట్ అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. మూడు కంపెనీల పరిధిలో ఎస్క్రో అకౌంట్‌ను ఓపెన్ చేయాలని పనిదినాలపై ఒత్తిడి తగ్గించాలని, పీస్‌రేట్ పెంచాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జె.శ్రీనివాసరావు, అప్పలస్వామి, రాజేష్, ఎం.సూరిబాబు, ఆర్.లక్ష్మణ్, ఆర్.అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆస్తిపన్ను పెంపు తగదు



ఏలూరు రూరల్, ఏప్రిల్ 18 : ఎన్నికల సమయంలో ఆస్తిపన్ను పెంచడం సరికాదని, మాజీ కార్పొరేటర్, వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యరకల సాంబశివరావు ఆరోపించారు. ఏలూరు, కొత్తూరు, కొబ్బరితోట పరిసర ప్రాంతాల్లో గత ఏడాది 50 గజాల ఇంటికి రూ.640 పన్ను చెల్లిస్తే అదేఇంటికి ఈ ఏడాది రూ.1,040 పన్ను విధించారని ఒకేసారి 40శాతం పెంపు దుర్మార్గం అన్నారు. ఇంటిపన్ను పెంపు పార్టీకి నష్టం చేకూరేలా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈవిధంగా పన్నులు పెంచుకుంటూ పోతే ప్రజల్లో వ్యతిరేకత వస్తోందని అనుమానం వ్యక్తం చేశారు. కౌన్సిల్లో తీర్మానం చేయకుండా పన్నుల పెంపు తగదన్నారు. దీనిపై పునరాలోచన చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇటీవల కార్పొరేషన్ సరఫరా చేస్తున్న మంచినీరు అపరిశుభ్రంగాను, పచ్చగా పసరనీరు వస్తుందన్నారు. ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందించాలని విజ్ఞప్తి చేశారు.

రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు చేస్తాం

భీమడోలు, ఏప్రిల్ 18 :మండలంలోని అన్ని ఆర్బీకేల్లో గోనె సంచులు అందుబాటులో ఉన్నాయని, రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేస్తామని జిల్లా వ్యవసాయాధికారి అబీబ్ బాషా తెలిపారు. గురువారం గుండుగొలనులో కల్లాల్లో ఆరబోసిన ధాన్యాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. ధాన్యం నాణ్యతా ప్రమాణాలు చూసి కొనుగోలు ప్రక్రియ జరుగుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా 27,240 ఎకరాల్లో వరి కోతలు పూర్తి అయ్యాయని, 30.240 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని, 18 లక్షల 32 వేల 560 గోనె సంచులను అన్ని కేంద్రాల్లో ఉంచామన్నారు. ఇప్పటివరకు భీమడోలు 8,783 ఎకరాలలో వరి కోతలు పూర్తయ్యాయని 14 ఆర్బీకే కేంద్రాల్లో గోనె సంచులు అందుబాటులో ఉన్నాయన్నారు. రైతుల నుంచి 9,830 మెట్రిక్ టన్నులు ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. కార్యక్రమంలో మండల ఏవో ఉషారాణి, రైతులు పాల్గొన్నారు.

మే 11న జాతీయ లోక్ అదాలత్

బుట్టాయగూడెం, ఏప్రిల్ 18 : రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలతో మే 11వ తేదీన జంగారెడ్డిగూడెం కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తామని జంగారెడ్డిగూడెం మండల న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి కిషోర్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం కోర్టులో జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో అన్ని రకాల రాజీ పడదగ్గ సివిల్ కేసులు, క్రిమినల్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, కుటుంబ తగాదా కేసులు, ప్రీలిటిగేషన్ బ్యాంకు, బి.ఎస్.ఎన్.ఎల్ కేసులు పరిష్కరించుకోవచ్చని తెలిపారు. జాతీయ లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవడం ద్వారా సమయాన్ని, డబ్బుని ఆదా చేసుకోవచ్చని తెలిపారు.

అగ్ని ప్రమాద బాధితులకు మానవత సాయం



బాధితులకు సహాయమందిస్తున్న మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు

పోలవరం, ఏప్రిల్ 18: పోలవరం పంచాయతీ గణేశ్‌నగర్ యానాది కాలనీలో ఇటీవల అగ్ని ప్రమాదంలో ఇళ్లు కాలిపోయిన బాధిత కుటుంబాలకు మానవతా స్వచ్ఛందసేవా సంస్థ సభ్యులు గృహోపకరణాలు సాయంగా అందించారు. గురువారం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మండల అధ్యక్షుడు గణేశ్ మాస్టర్ మాట్లాడుతూ అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులకు పలువురు మానవత్వంతో సాయం అందించడం శుభపరిణామ మన్నారు. బాధిత కుటుం బాలకు అవసరమయ్యే మంచాలు, కుర్చీలు, స్టూళ్ళు ఇతర గృహోపకరణాలు సంస్థ తరఫున అందించినట్టు తెలిపారు. కార్యక్రమంలో మానవత సభ్యులు చంద్రయ్య ఆకుల నరసింహమూర్తి, నారాయణ, కోటంరాజు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రేపు ఆయుర్వేద ఉచిత వైద్య శిబిరం

ఉంగుటూరు, ఏప్రిల్ 18 : ఉంగుటూరు ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రిలో శనివారం ఉదయం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నామని గ్రామ సర్పంచ్ బండారు సింధుమధు తెలిపారు. ఉంగుటూరు, దెందులూరు, ఖండవల్లి ఆయుర్వేద వైద్యులు పరీక్షలు జరుపుతారన్నారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉంగుటూరులో 26 మంది వలంటీర్ల రాజీనామా

ఉంగుటూరు, ఏప్రిల్ 18 : ఉంగుటూరు మండలంలో గురువారం 26 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. బాదంపూడిలో 20 మంది, నాచుగుంటలో ఆరుగురు రాజీనామా చేశారని ఎంపీడీవో శర్మ తెలిపారు.

25న గురుకుల విద్యాలయాల ప్రవేశ పరీక్ష

టి.నరసాపురం, ఏప్రిల్ 18 : ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల్లో ప్రవేశ పరీక్ష ఈనెల 25న నిర్వహిస్తున్నట్టు ఆ పాఠశాలల ఏలూరు జిల్లా కన్వీనర్ అప్పలరాజుగూడెం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ డీఎస్‌బీ శంకరరావు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గురుకుల పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలల్లో 2024-25 సంవత్సరానికి 5, 6, 7, 8 తరగతుల ప్రవేశానికి 25న ఉదయం పది నుంచి మధ్యాహ్నం పన్నెండు గంటల వరకు, జూనియర్ డిగ్రీ కళాశాల ప్రవేశానికి మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఏలూరులో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. హాల్ టిక్కెట్లను 17వ తేదీ నుంచి తమ ఐడీ పుట్టిన తేదీ ద్వారా వెబ్ సైట్ నుంచి హాల్ టిక్కెట్లు డౌన్ లోడ్ చేసుకోవచ్చన్నారు. హాల్ టికెట్లతో కేటాయించిన పరీక్ష కేంద్రానికి గంట ముందు చేరుకోవాలన్నారు.

ఎన్జీవోల చలివేంద్రం ప్రారంభం

ఏలూరు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 18:స్థానిక జడ్పీ కార్యాలయంవద్ద గురువారం ఏపీ ఎన్జీవోల సంఘం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని జడ్పీ సీఈవో సుబ్బారావు ప్రారంభించారు. ఎన్జీవోల సంఘ ఉమ్మడి జిల్లా అధ్యక్ష, కార్యదర్శి సీహెచ్.శ్రీనివాస్, ఎన్.రామారావు, రాష్ట్ర అసిస్టెంట్ సెక్రటరీ జనరల్ ఆర్.ఎస్.హరనాథ్, ఏలూరు తాలూకా నాయకులు శ్రీధర్‌రాజు, సత్యనారాయణ, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

పెదపాడు/టి.నరసాపురం, ఏప్రిల్ 18 : పెదపాడు మండలం పెదపాడు సెక్షన్ పరిధిలో ఉన్న 33/11 కేవీ కొక్కిరపాడు సబ్‌స్టేషన్ మరమ్మతు చేయుటకు శుక్రవారం కరెంట్ సరఫరా నిలుపుదల చేస్తామని పెదపాడు ఎలక్ట్రికల్ ఏఈ యడ్ల రాంబాబు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కొక్కిరపాడు సబ్‌స్టేషన్ పరిధిలో గల కొక్కిరపాడు, వేంపాడు గ్రామాల్లో ఉదయం ఆరు గంటల నుంచి మధ్యాహ్నం పన్నెండు గంటల వరకు సరఫరా ఉండదని ప్రజలు సహకరించాలన్నారు. టి.నరసాపురం మండలంలో విద్యుత్ లైన్ల వార్షిక మరమ్మతులు, చెట్టు కొమ్మల తొలగింపు కారణంగా శుక్రవారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని జంగారెడ్డిగూడెం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.రాధాకృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. సోములపాలెం, బండివారిగూడెం, రాజుపోతేపల్లి, తీగలవంచ, బందంచర్ల ఫీడర్లు పరిధిలో విద్యుత్ అంతరాయం కల్గుతుందన్నారు.

విత్తన కేంద్రంలో నాణ్యత పాటించాలి

పెదపాడు, ఏప్రిల్ 18 : రైతులకు అందించే విత్తన కేంద్రాల్లో నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని ఏలూరు జిల్లా వ్యవసాయాధికారి షేక్ హబీబ్ భాషా తెలిపారు. వసంతవాడ గ్రామంలోని విత్తన కేంద్రం అన్నపూర్ణ సీడ్స్‌ను గురువారం ఆయన సందర్శించి, రికార్డులను పరిశీలన చేశారు. కార్యక్రమంలో ఏడీఏ సుబ్బారావు, టెక్నికల్ ఏవోలు ప్రవీణ్, భాషా, పెదపాడు ఏవో వి.ప్రదీప్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 18 : బంధువుల ఇంటికి వెళ్లి.. తన గ్రామానికి వస్తూ మార్గమధ్యలో ఏలూరు పాతబస్టాండ్ వద్ద అదృశ్యమైందని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. దెందులూరు మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక ఏడో తరగతి వరకు చదివి మానేసింది. ఇటీవల కైకలూరులో ఉన్న బంధువుల ఇంటికి వెళ్లి ఈనెల 17వ తేదీన కైకలూరు నుంచి ఒంటరిగా ఆర్టీసీ బస్సు ఎక్కి ఏలూరు పాతబస్టాండ్ వద్ద దిగింది. అక్కడ నుంచి బంధువులకు ఫోన్ చేసి చెప్పింది. ఆ తరువాత గ్రామానికి చేరుకోలేదు. బాలిక వద్ద ఉన్న ఫోన్ స్విచ్ ఆఫ్ కావడంతో ఆమె కోసం వెతికారు. ఆచూకీ లేకపోవడంతో బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏలూరు టూటౌన్ పోలీసులు తెలిపారు.

ఆధ్యాత్మికం

అడవికొలనులో శ్రీరాముడి రథోత్సవం



శ్రీరాముడి రథోత్సవంలో భక్తులు

నిడమర్రు, ఏప్రిల్ 18 :అడవికొలనులో గ్రామదేవత సంగాలమ్మ జాతర, శ్రీరామనవమి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని రామాలయంలో కల్యాణమహోత్సవాల్లో భాగంగా వైభవంగా రథోత్సవం నిర్వహించారు. సంగాలమ్మ ఆలయం వద్ద నుంచి గ్రామం వీధుల్లో సాగిన రథోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దర్శించుకున్నారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన జాతరలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామంలో ఆచారం మేరకు మహిళలకు మాత్రమే ఈ రోజు జాతరలో ప్రవేశం ఉందని, పురుషులకు ప్రవేశం లేదని నిర్వాహకులు తెలిపారు.

నేటి నుంచి నగరేశ్వరస్వామి కల్యాణోత్సవాలు

ఏలూరుకార్పొరేషన్, ఏప్రిల్ 18. అగ్రహారంలో గల నగరేశ్వరస్వామి ఆలయం వద్ద ఈనెల 19 నుంచి 25 తేదీ వరకు స్వామి వారి కల్యాణ మహోత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఈవో గుబ్బల రామపెద్దింట్లరావు తెలిపారు. ఉత్సవాలలో భాగంగా 19వ తేదీ స్వామివారిని పెండ్లి కుమారుడిగా, అమ్మవార్లను పెండ్లి కుమార్తెలుగా చేస్తామన్నారు. గణపతి పూజ, ధ్వజారోహణ జరుగుతుందన్నారు. 20,21వ తేదీల్లో హోమం, బలిహరణ, 22 రాత్రి ఎదుర్కోలు సన్నాహం, అనంత రం స్వామివారి కల్యాణ మహోత్సవం జరగుతుంద న్నారు .23 రథోత్సవం, 24 వసంతోత్సవం, ధ్వజారో హణ, 25 నపూర్ణాహుతి, పవళింపుసేవ కార్యక్రమా లతో ఉత్సవాలు ముగుస్తాయని ఈవో తెలిపారు.



రామాలయంలో భక్తిరంజని ప్రతినిధుల భజన

రామాలయంలో భజన సంకీర్తనలు

ఏలూరు కార్పొరేషన్, ఏప్రిల్ 18. సత్రంపాడు ఆర్టీసీ కాలనీలోని రామాలయం వద్ద జరుగుతున్న శ్రీరామనవమి ఉత్సవాలలో భాగంగా గురువారం దెందులూరు మండలం ఉండ్రాజవరానికి చెందిన విజయశ్రీ ఉమామహేశ్వర భక్తిరంజని అధ్యక్షుడు బోను ఉమామహేశ్వరరావు శిష్య బృందం సామూహికంగా 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణ, భక్తిసంకీర్తనలను ఆలపించారు. కమిటీ వారు భక్తులకు కావాల్సిన ఏర్పాట్లను పర్యవేక్షించారు.



భారీ వాహనాల కారణంగా చాట్రాయి సెంటర్‌లో నిలిచిన ట్రాఫిక్

ప్రతి రోజూ.. ఇదే తీరు!

- అసలే ఇరుకు రోడ్డు.. ఆపై భారీ వాహనాల రాకపోకలు
- ట్రాఫిక్ వలయంలో విస్సన్నపేట-వెలగలపల్లి రహదారి
- రహదారి విస్తరణకు ప్రతిపాదించినా రాలని నిధులు

అసలే సింగిల్ రోడ్డు, ఏలూరు-ఎన్టీఆర్ జిల్లాను కలిపే రహదారి కావటం వలన మామూలుగానే వాహనాల రద్దీ ఎక్కువ, దీనికి తోడు భారీ వాహనాల రాకపోకలు పెరగటంతో ఈ రోడ్డుపై ప్రయాణం ప్రమాదకరంగా ఉంది.

చాట్రాయి, ఏప్రిల్ 18: విస్సన్నపేట-వెలగలపల్లి ఆర్అండ్‌బీ రహదారి (వివి రోడ్డు)లో చాట్రాయి మీదుగా భారీ వాహనాలు రయ్ రయ్ మని మందలుగా రాకపోకలు సాగిస్తుండటంతో రోడ్లు ధ్వంసం అవటమే కాక ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహన చోదకులు, ప్రజలు హడలిపోతున్నారు. భారీ వాహనాల తాకిడికి రహదారి ధ్వంసం అవుతున్నా అధికారులు పట్టించుకోవటం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్టీఆర్ జిల్లా కొండపల్లి, మేడూరు క్రషర్ల నుంచి 40, 50 టన్నుల బరువైన కంకరతో భారీ వాహనాలు చాట్రాయి మీదుగా చింతలపూడి, జంగారెడ్డిగూడెం ప్రాంతానికి రాకపోకలు సాగిస్తున్నాయి. భారీ వాహనాలు వరుసగా 4, 5 వస్తుండటం, అసలే సింగల్ రోడ్డు కావటం వలన తీవ్ర ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. ఓవర్ లోడ్, అతివేగం వలన భారీ వాహనాలు అదుపుతప్పి రోడ్డు మార్జిన్లులోకి దిగిపోతున్నాయి. భారీ వాహన చోదకులు రోడ్డు మలుపుల్లో కూడా అతివేగంగా నడుపుతుండటం వలన బైక్‌లు, ఆటోలు, కార్లు నడిపేవారు ఎక్కడ ప్రమాదానికి గురవుతోమోనని హడలిపోతున్నారు. మండల కేంద్రం చాట్రాయిలో రోడ్లు ఇరుకుగా ఉండటంతో భారీ వాహనాలు వచ్చినప్పుడల్లా ట్రాఫిక్ నిలిచిపోతోంది. నర్సాపురం నుంచి తమ్మిలేరు ప్రాజెక్టు రెగ్యులేటర్ వరకు 15 కిలోమీటర్ల దూరం ఈ రోడ్డును డబుల్‌రోడ్డుగా మార్చాలని ఐదేళ్ళ క్రితం ఆర్అండ్‌బీ అధికారులు ప్రతిపాదనలు పంపగా నిధులు మంజూరు కాలేదు.

భారీ వాహనాలను నియంత్రించాలి



చాట్రాయి మీదుగా భారీ వాహనాల రాకపోకలు నియంత్రించాలి. సింగిల్ రోడ్డులో 40, 50 టన్నుల వాహనాలు వేగంగా తిరగటం వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నాం. చాట్రాయి గ్రామ పరిధిలో రోడ్లు ఇరుకుగా ఉండటంతో భారీ వాహనాల వల్ల ట్రాఫిక్ సమస్య జఠిలమవుతోంది. రహదారి విస్తరణకు ప్రభుత్వం నిధులు మంజూరు చెయ్యాలి.

– గోళ్ళ విశ్వేశ్వరరావు, చాట్రాయి.



నీటి తరలింపుపై సూచనలిస్తున్న జడ్పీ సీఈవో

మంచినీటి చెరువులు నింపండి

- జడ్పీ సీఈఓ సుబ్బారావు

మండవల్లి, ఏప్రిల్ 18: మండలంలో మంచినీటి చెరువులకు నీటిని నింపే ప్రక్రియను గురువారం జడ్పీ సీఈవో సుబ్బారావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సత్యనారాయణ పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ వేసవిలో నీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటూ చెరువులన్నింటిని కూడా పూర్తిగా నింపుకోవాలని సూచించారు. అలాగే మంచినీటిని చేపల చెరువులకు తరలించకుండా సిబ్బంది జాగ్రత్త వహించాలన్నారు. అలాగే అప్పాపురం నుంచి మండవల్లి, భైరవపట్నం గ్రామాల మంచినీటి చెరువులకు తరలించే ప్రక్రియను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలిచ్చారు. ఎంపీడీవో ఆర్. బేబి శ్రీలక్ష్మి, ఈవోపీఆర్డీ ఆనంద్‌బాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కృష్ణారావు, అప్పాపురం పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, పెరికేగూడెం కార్యదర్శి రాధిక, భైరవపట్నం కార్యదర్శి ప్రభాకర్ పాల్గొన్నారు.



పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ప్రేమజంట

పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట

- ఒక్కటి చేసిన పోలీసులు
- పోలీస్ స్టేషన్ ఎదుట యువతి బంధువుల ఆందోళన
- 17 మందిపై కేసు నమోదు

ముసునూరు, ఏప్రిల్ 18: మండలంలోని కాట్రేనిపాడుకు చెందిన ప్రేమజంట గురువారం ముసునూరు పోలీసులను ఆశ్రయించింది. ఎస్ఐ పి.వాసు వివరాల ప్రకారం సొంగా వంశీకృష్ణ, గుత్తి లావణ్య కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. అయితే లావణ్య తన బంధువు వివాహానికి చింతలపూడి వెళ్ళింది. ఈ క్రమంలో లావణ్య, వంశీకృష్ణ చింతలపూడిలో వివాహం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు వచ్చినట్లు ఎస్ఐ తెలిపారు. వీరిద్దరి ఆధార్ కార్డులను పరిశీలించగా ఇద్దరు మేజర్లని తేలడంతో ఇరువురి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చామని, యువకుడి తల్లిదండ్రులు రాగా, యువతి తల్లిదండ్రులు మధ్యాహ్నం వరకు రాలేదన్నారు. తమ తల్లిదండ్రులు వస్తే తమపై దాడి చేస్తారని యువతి లిఖితపూర్వకంగా రాసివ్వడంతో యువకుడి తల్లిదండ్రులకు వారిని అప్పగించి ఎస్ఐ తెలిపారు. అయితే యువతి తల్లిదండ్రులు, బంధవులు సాయంత్రం స్టేషన్‌కు వచ్చి వారిద్దరిని ఎందుకు పంపారని స్టేషన్ ముందు ఆందోళనకు దిగారు. దీంతో యువతి బంధువులతో ఎస్ఐ మాట్లాడి, లావణ్యను స్టేషన్‌కు రప్పించారు. లావణ్యకు ఆమె తల్లిదండ్రులు, బంధువులు నచ్చచెప్పే ప్రయత్నం చేసినా, వంశీకృష్ణతో వారి ఇంటివద్దే ఉంటానని లావణ్య తేల్చిచెప్పింది. దీంతో ఎస్ఐ యువకుడి తల్లిదండ్రుల వెంట వారిద్దరిని పంపారు. దీంతో కథ సుఖాంతమైంది. అయితే పోలీస్‌స్టేషన్ ముందు ఆందోళనకు దిగి, ఘర్షణ వాతావరణాన్ని సృష్టించిన 17 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వాసు తెలిపారు. యువతి బంధువులు నాగమణి, వెంకటేశ్వరావుతోపాటు దీనిని ప్రోత్సహించిన పెద్దలు, నాయకులు మొత్తం 17 మందిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఘనంగా సారథి జన్మదిన వేడుకలు



నూజివీడు పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసిన కొలుసు..



నెక్కలంలో గజమాలతో సత్కారం

నూజివీడు టౌన్, ఏప్రిల్ 18: నూజివీడు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్, కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కొలుసు పార్థసారథి జన్మదిన వేడుకలను నూజివీడు లో ఘనంగా నిర్వహించారు. నూజివీడు నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో ఆయన జన్మదిన కేక్‌ను సతీమణి లక్ష్మీకమలతో కలిసి కట్ చేయగా నియోజక వర్గానికి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు ఆయనకు జన్మదిన శుభా కాంక్షలు తెలిపారు. సారథి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని నూజివీడులో షిర్డిసాయి ఆలయంలో ఆయన కుమారుడు నితిన్ కృష్ణ ప్రత్యేక పూజలు చేశారు. షిర్డిసాయి ఆలయంతో పాటు తుక్కులూరు జేబీఎల్ హోమ్, నూజివీడు స్నేహారైడ్స్‌లోని చిన్నారులకు అన్నదానం చేశారు.

చాట్రాయి: నూజివీడు అసెంబ్లీ కూటమి అభ్యర్థి కొలుసు పార్థసారథి జన్మదినం సందర్భంగా చాట్రాయి మండల టీడీపీ నాయకులు గురువారం ఆయన్ని కలసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి మందపాటి బసవారెడ్డి, విజయ డెయిరీ డైరెక్టర్ బొట్టు రామచంద్రరావు, జిల్లా లీగల్ సెల్ కార్యదర్శి అత్తులూరి శ్రీనివాసరావు, తెలుగు రైతు నియోజకవర్గ కార్యనిర్వాహక కార్యదర్శి మందలపు జగదీష్, మండల నాయకులు కలకండ భాస్కరరావు, మన్నధరావు తదితరులు ఆగిరిపల్లి మండలంలో ఎన్నికల ప్రచారంలో ఉన్న పార్థసారథిని కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ముసునూరు: మండలంలోని పలు గ్రామాల్లో నూజివీడు కూటమి అభ్యర్థి కొలుసు పార్థసారథి జన్మదిన వేడుకలు టీడీపీ శ్రేణులు గురువారం ఘనంగా నిర్వహించాయి. చెక్కపల్లి, గుడిపాడు, రమణక్కపేట, ముసునూరు, గోపవరం తదితర గ్రామాల్లో కేకులు కట్ చేసి, మిఠాయిలు పంపిణీ చేశారు. నూజివీడు టీడీపీ కార్యాలయానికి తరలివెళ్ళి పార్థసారథికి పుష్పగుచ్ఛాలు, అరుదైన మొక్కలను అందజేసి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ఆగిరిపల్లి: నూజివీడు నియోజకవర్గ కూటమి అభ్యర్థి కొలుసు పార్థసారథి పుట్టినరోజును పురస్కరించుకుని ఆగిరిపల్లి అడ్డరోడ్డులోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేసి, నెక్కలంలో ప్రచారం చేశారు. అక్కడ ప్రజలు ఆయనను గజమాలతో సత్కరించారు. గ్రామ వాసి చెరుకూరి శివరామ్ ఆధ్వర్యంలో కేక్‌కట్‌చేసి పార్టీ కార్యాలయం ప్రారంభించి, ప్రచారానికి బయల్దేరారు. ప్రచారంలో సారథి మాట్లాడుతూ సూపర్‌సిక్స్ పథకాలు ప్రజలకు వివరించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ ఎన్డీఏ కూటమితోనే సాధ్యమన్నారు. పార్థసారథి పుట్టినరోజును పురస్కరించుకుని పోతవరప్పాడు ఎలిజబెత్ అనాథ ఆశ్రమంలో నూతలపాటి నాగభూషణం ఆధ్వర్యంలో బాలలకు అన్నవితరణ చేశారు. సారథి కుమారుడు నితిన్‌కృష్ణ స్వయంగా వడ్డించారు. ఆగిరిపల్లి గ్రామ అధ్యక్షుడు నరసింహారావు, పోతవరప్పాడు అధ్యక్షుడు రమేష్ పాల్గొన్నారు.

వీధి కుక్కల దాడి.. ముగ్గురికి గాయాలు



తీవ్రంగా గాయపడిన రషీద్


ఆగిరిపల్లి, ఏప్రిల్ 18: ఆగిరిపల్లి గ్రామంలో వీధికుక్కల బెడద ఎక్కువైంది. గురువారం ముగ్గురు వ్యక్తులపై దాడి చేశాయి. రషీద్ (48) అనే వ్యక్తిని తీవ్రంగా గాయపరచడంతో వ్యాక్సిన్ ఇచ్చి డ్రెస్సింగ్ చేసి ఎక్స్‌రే నిమిత్తం నూజివీడు పంపారు. మరో ఇద్దరు గరిసేపల్లి కొండలు, మానేపల్లి నానికి చికిత్స చేశామని డాక్టర్ టీనా తెలిపారు. ఈ వీధికుక్కల వల్ల మండలంలో రోజుకు కనీసం 20 డోసులు యాంటీ ర్యాబిస్ వ్యాక్సిన్‌లు వేయవలసి వస్తోందని డాక్టర్ టీనా తెలిపారు.



సాయుధ బలగాల కవాతు

కలిదిండి, ఏప్రిల్ 18 : ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో కలిదిండి మండలంలో ఉప్పుటేరు తీర గ్రామాలైన చినతాడినాడ, సున్నంపూడి, దుంపలకోడు దిబ్బ గ్రామాల్లో గురువారం సాయుధ బలగాలు కవాతు నిర్వహించాయి. ఈ సందర్భంగా కైకలూరు సీఐ కృష్ణకుమార్ మాట్లాడుతూ ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలన్నారు. సమస్యాత్మక గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎస్ఐ ప్రియకుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పశ్చిమలో పవన్ కల్యాణ్ పర్యటన



భీమవరం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో పర్యటించనున్నారు. ఈ నెల 21, 22 తేదీల్లో నిర్వహించే ఎన్నికల సభల్లో పాల్గొంటారు. 21న భీమవరం, నరసాపురంలో, 22న తాడేపల్లిగూడెం, ఉంగుటూరు సభల్లో పాల్గొంటారు. పోలవరం నియోజకవ ర్గంలో 30వ తేదీన పర్యటిస్తారని పార్టీ వర్గాలు చెపుతున్నాయి. చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు ఉమ్మడిగా హాజరవుతారా లేదా జనసేనాని ఒక్కరే పాల్గొంటారా అనేది త్వరలో నిర్ణయం కానుంది.

దౌర్జన్య పాలనకు స్వస్తి పలకాలి : రాధా



కాపు ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న రాధా చిత్రంలో కామినేని

కైకలూరు, ఏప్రిల్ 18: వైసీపీ దౌర్జన్య పాలనకు స్వస్తి పలకాలంటే ప్రతి ఒక్కరూ కూటమి అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని టీడీపీ నాయకుడు వంగవీటి రాధా పిలుపునిచ్చారు. గురువారం కైకలూరు సీఎన్నార్ గార్డెన్లో కాపుల ఆత్మీయ సమావేశాన్ని మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు అధ్యక్షతన నిర్వహించారు. జన సైనికులు కైకలూరులో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. రాధా మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి బటన్ నొక్కానని చెబుతూ లక్షల కోట్లు నొక్కేసి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేశాడన్నారు. జనసైనికులంతా కూటమి విజయానికి పాటుపడాలన్నారు. కామినేని అత్యంత అనుభవజ్ఞుడైన నాయకుడని ఆయనను గెలిపిస్తే నియోజకవర్గం అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు. కామినేనికి కమలం గుర్తుపై, ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్‌కుమార్‌యాదవ్‌కు సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కామినేని మాట్లాడుతూ పవన్‌కల్యాణ్ మద్దతుతోనే బరిలోకి దిగానని ఆయన ఆశయాలకు తగినట్లుగా కమలం గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. అటపాక గ్రామం నుంచి సుమారు 200మంది వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరారు. పాస్టర్ల సంక్షేమానికి కృషి చేస్తానని కామినేని అన్నారు. గురువారం కైకలూరులో నియోజకవర్గ పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో చర్చిలన్నింటికి ప్రభుత్వ గుర్తింపుతో పాటు ఎస్సీ కమ్యూనిటీ హాలు నిర్మాణం, శ్మశానవాటిక అభివృద్ధికి నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

కలిదిండి: కూటమి గెలుపుతోనే రాష్ట్రాభివృద్ధి అని వంగవీటి రాధా అన్నారు. గురువారం కైకలూరు నియోజకవర్గ కూటమి అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్‌తో కలసి కోరుకొల్లు, సానారుద్రవరం, ఎస్.ఆర్పీ అగ్రహారం, పడమటిపాలెం, కలిదిండి, కాళ్లపాలెం గ్రామాల్లో కార్లు, బైకుల భారీ ర్యాలీతో ప్రచారం నిర్వహించి కూటమి అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఎస్.ఆర్పీ అగ్రహారంలో జనసేన ఆంధ్ర సెంట్రల్ కో-కన్వీనర్ నల్లగోపుల చలపతిరావు ఆధ్వర్యంలో రాధాకు గజమాలతో స్వాగతం పలికారు.

ముదినేపల్లి రూరల్: నియోజకవర్గ అభివృద్ధికి తనను గెలిపించాలని కామినేని శ్రీనివాస్ ఓటర్లను అభ్యర్థించారు. గురువార దేవపూడి ప్రొద్దువాక గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాల టీడీపీ పాలన ప్రస్తుత వైసీపీ పాలనతో బేరీజు వేసుకుని నిర్ణయం తీసుకోవాలని సూచించారు.

వాహనాల విస్తృత తనిఖీ



ముసునూరు, ఏప్రిల్ 18: ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం ఆధ్వర్యంలో గ్రామాల సరిహద్దుల్లో విస్తృత తనిఖీలు చేపట్టిం ది. గురువారం వలసపల్లి బ్రిడ్జి, ముసునూరు శివారు నేలపాటివారి కుంట, వేల్పుచర్ల తదితర గ్రామాల్లో స్క్వాడ్ అధికారి పి.శ్రీనివాసరావు వాహనాలు తనిఖీ చేశారు. ఎన్నికల కోడ్ నిబంధనలను అందరూ పాటించాలని, అక్రమంగా నగదు, మద్యం, ఇతర వస్తువులను తరలిస్తూ పట్టుబడితే వాహనాలను సీజ్‌చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఓటరు మాట

నీరిస్తే.. ఓటేస్తాం!

తాగునీటిపై పుట్లచెరువు మహిళల మొర..



నాయకులకు మంచినీటి సమస్య వివరిస్తున్న మహిళలు

ఎన్నికలు వచ్చాయి.. నాయకులు ప్రత్యక్షమవుతున్నారు. తాగేందుకు గుక్కెడు నీళ్లు ఇవ్వండి.. చాలు ఓటేస్తాం అంటున్నారు పుట్లచెరువు మహిళలు. అంటూ ఆనాడు వైసీపీ నేతలు మొరపెట్టుకున్నాం. ఇచ్చిన హామీ మేరకు ఓట్లు వేశాం. తర్వాత మాకు ఇచ్చిన హామి నీటి మూటగానే మిగిలింది. మంచినీటి మాటే పట్టించుకున్న నాథుడే కరువయ్యాడు. మళ్లి ఎన్నికలు వచ్చేశాయి సమస్య అలాగే ఉంది. ఈ సారైన మాకు మంచినీళ్లు ఇవ్వండి... మా ఓట్లు మీకే వేస్తాం అంటూ గురువారం పుట్లచెరువులో ఎన్నికల ప్రచారం చేస్తున్న టీడీపీ, జనసే, బీజేపీ నాయకుల వద్ద తమ మొరపెట్టుకున్నారు. గత ఎన్నికల్లో వైసీపీ మాటలు నమ్మి మోసపోయామని అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో టీడీపీ, జనసేన, బీజేపీ సమక్షంలోనే కైకలూరూ కూటమి అభ్యర్థి కామినేని శ్రీనివాస్‌కు ఫోన్‌లో పరిస్థితిని వివరించారు. మంచినీటి పరిష్కరించేందుకు తన శాయశక్తుల కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం గ్రామంలో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. – మండవల్లి



సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక అధికారులు

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

ముదినేపల్లి రూరల్, ఏప్రిల్ 18: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గురువారం సింగరాయపాలెంలోని గ్రావెల్ ఫీడ్ కంపెనీ సిబ్బందికి అగ్నిప్రమాదాలపై మాక్‌డ్రిల్ నిర్వహించి అవగాహన కల్పించారు. ప్రమాదం జరిగితే ఎలాంటి జాగ్రత్తలు ముందస్తుగా తీసుకోవాలో వివరించారు. కంపెనీ జనరల్ మేనేజరు ఎల్.చౌదరి, కంపెనీ ఫైర్ సేఫ్టీ అధికారి కేవీఎల్ ప్రసాద్, అగ్నిమాపక దళాధికారి క్రాంతికుమార్ పాల్గొన్నారు.

మాజీ జడ్పీటీసీ విజయలక్ష్మి టీడీపీలో చేరిక

ముదినేపల్లి రూరల్, ఏప్రిల్ 18: జడ్పీటీసీ మాజీ సభ్యురాలు, వైసీపీకి చెందిన భూపతి విజయలక్ష్మి గురువారం కొడాలి వినోద్ ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా కూటమి అభ్యర్థి కామినేని శ్రీనివాస్ ఆమెకు టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గతంలో టీడీపీ నుండి జడ్పీటీసీగా గెలిచిన విజయలక్ష్మి వైసీపీలోకి వెళ్లారు. తిరిగి టీడీపీలోకి రావడం సంతోషంగా ఉందని విజయలక్ష్మి పేర్కొన్నారు.

టీడీపీతోనే మాదిగల అభివృద్ధి

చాట్రాయి, ఏప్రిల్ 18: మాదిగ వర్గీయులు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలంటే టీడీపీని గెలిపించుకోవాలని టీడీపీ మాదిగ నాయకులు గార్లపాటి మారేష్, మోదుగు ముత్తయ్య కోరారు. నరసింహారావుపాలెం దళితవాడలో మాదిగ వర్గీయులతో వీరు మాట్లాడుతూ చంద్రబాబు సీఎంగా ఉండగా ఎస్సీ వర్గీకరణ అమలు చేసి మాదిగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించగా, కొందరు కుట్ర పూరితంగా వర్గీకరణను రద్దు చేయించి మాదిగ జాతికి తీరని ద్రోహం చేశారన్నారు. ఎస్సీ వర్గీకరణకు పార్లమెంట్‌లో చట్టబద్ధత కల్పించాలంటే కూటమిని గెలుపించుకోవాలని కోరారు. నాయకులు కొమ్ము సుజనరావు, తేళ్ళూరి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కాంగ్రెస్ అభ్యర్థి నోబుల్ నామినేషన్

కైకలూరు, ఏప్రిల్ 18: కైకలూరు అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బొడ్డు నోబుల్ శుక్రవారం నామినేషన్ వేయనున్నట్లు తెలిపారు. ఉదయం 10.30 గంటలకు కైకలూరు తహసీల్దార్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేస్తున్నట్లు నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున తరలిరావాలని ఆయన కోరారు.



పెద్దింటమ్మ హుండీ ఆదాయం లెక్కింపు

కైకలూరు, ఏప్రిల్ 18: కొల్లేటికోట పెద్దింటమ్మవారి హుండీ ఆదాయం రూ.14.29 లక్షలు లభించినట్టు ఆలయ ఈవో కేవీ గోపాలరావు తెలిపారు. గురువారం గుడివాడ ఎండోమెంట్ తనిఖీ అధికారి పర్యవేక్షణలో హుండీలను లెక్కించారు. 55 రోజులకు గాను రూ.14 లక్షల 29 వేల 977, ఏడు గ్రాముల బంగారం, 440 గ్రామల వెండి వచ్చినట్లు తెలిపారు. లెక్కింపులో దేవస్థాన సిబ్బంది, కైకలూరు రూరల్ పోలీసులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రెండు కార్లు ఢీ

ఒకరి మృతి.. మరొకరికి గాయాలు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 18 : చైల్డ్‌వెల్ఫేర్‌లో మేనేజర్‌గా ఉద్యోగం చేసి రిటైరై ప్రస్తుతం న్యాయవాదిగా కొనసాగుతున్న వ్యక్తి కారునడుపుతుండగా మరో కారు వచ్చి ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. భీమవరంలోని గునుపూడికి చెందిన యాళ్ళ హనక్‌వర్ధన్(61) గతంలో చైల్డ్‌వెల్ఫేర్‌లో మేనేజర్‌గా చేసి రిటైర్డ్ అయ్యారు. ప్రస్తుతం న్యాయవాదిగా ప్రాక్టీసు చేస్తున్నారు. తన కారులో గురువారం ఉదయం భీమవరం నుంచి విజయవాడ వెళ్తున్నారు. మార్గమధ్యలో ఏలూరు రూరల్ మండలం కలకుర్రు గ్రామం వద్ద ఎదురుగా కారు అతివేగంగా వచ్చి హనక్‌వర్ధన్ కారును ఢీ కొంది. హనక్‌వర్ధన్ అక్కడికక్కడే మృతి చెందారు. ఢీ కొన్న కారులోని వ్యక్తి గాయాలపాలవ్వడంతో ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్ళారు. ఈ సమాచారం అందుకున్న రూరల్ ఎస్ఐ కె.రాజారెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.



ముసునూరులో నిర్మానుష్యంగా ఉన్న ప్రధాన రహదారి

మండుతున్న ఎండలు..

అల్లాడుతున్న ప్రజలు

ముసునూరు, ఏప్రిల్ 18: ఎండల తీవ్రతకు ప్రజలు అల్లాడుతున్నారు. ఉదయం 11 లోపే ప్రధాన రహదారులు జనసంచారం లేక నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి. అయితే రాత్రి సమయంలోను వేడిగాలులు వీయడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ప్రతిరోజు 38 నుంచి 41 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయంటే మే నెలలో ఎండల తీవ్రత ఎలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

కలిదిండి: మండలంలో ఎండలు మండుతున్నాయి. రోడ్లపై ప్రయాణీకులు లేక బస్సులు ఖాళీగా రాకపోకలు సాగిస్తున్నాయి. గురువారం కలిదిండిలో 42 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కావటంతో ఎండ వేడికి ప్రజలు ఉక్కిరి బిక్కిరయ్యారు. చలివేంద్రాలు లేకపోవటంతో ప్రయాణీకులు అవస్థలు పడుతున్నారు. వాటర్ బాటిల్స్‌ను కొనుగోలు చేసి తాగుతున్నారు. పేదలు టీ స్టాల్స్ వద్ద ఉన్న నీటినే తాగి దాహం తీర్చుకుంటున్నారు. కలిదిండి సెంటర్‌లో బస్టాప్ వద్ద దాతలు చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



విద్యార్థులకు నగదు బహుమతులు

కైకలూరు, ఏప్రిల్ 18: ప్రభుత్వ కళాశాలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందించడం అభినందనీయమని భుజబలపట్నం జడ్పీ హైస్కూల్ అభివృద్ధి కమిటీ చైర్మన్ ముదునూరి రవిరాజు అన్నారు. గురువారం పాఠశాలలో ఇంటర్ పరీక్షల్లో ఫస్టియర్ తెలుగులో 9 మంది బాలికలు 90 మార్కులకు పైగా సాధించగా వారికి ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున నగదు బహుమతిని పాఠశాల తెలుగు అధ్యాపకుడు వీవీ రాజారావు వితరణ చేసి చైర్మన్ రవిరాజు చేతులమీదుగా అందజేశారు. జిల్లా పరిషత్ హైస్కూల్లో మొట్టమొదటిగా బాలికల జూనియర్ కళాశాలను ఏర్పాటు చేసిన మొదటి సంవత్సరమే బాలికలు ఈ ఘనత సాధించారు. హెచ్ఎం రాజేశ్వరి, ఎంఈఓ-2 శ్రీనివాసరావు, కార్యదర్శి రామారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేద పాఠశాల అభివృద్ధికి విరాళం



ఆగిరిపల్లి, ఏప్రిల్ 18: ఆగిరిపల్లిలోని శ్రీ శోభనాచల లక్ష్మీనరసింహ వేద పాఠశాలకు విజయవాడ వాస్తవ్యులు వెంకట రామశాస్త్రి స్మృత్యర్థం ఆయన సతీమణి లక్ష్మీకామేశ్వరి, కుమార్తె లక్ష్మి చిద్రూపి విద్యార్థుల భోజనాలకు, గోగ్రాసానికి రూ.40 వేలు ఆర్థిక సాయం చేశారు. వీరిని కార్యదర్శి శర్మ అభినందించారు.

వాసవీ క్లబ్ మజ్జిగ వితరణ



నూజివీడు టౌన్, ఏప్రిల్ 18: వేసవి ఎండల తీవ్రత నేపథ్యంలో నూజివీడులో వాసవీక్లబ్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రతి రోజూ దాతల సహకారంతో మజ్జిగ పంపిణీ చేస్తామని, వాసవీ క్లబ్ సభ్యులు చిన్నం శ్రీనివాసరావు, సతీష్ తెలిపారు. కాగా ఈ సందర్భంగా సుమారు వెయ్యి మందికి మజ్జిగను పంపిణీ చేశారు.